ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


5



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

గురువారం 13 ఫిబ్రవరి 2025



భక్తజన సంద్రమైన వీధి



సర్వాంగ సుందరంగా ముస్తాబైన పేట వేంకటరమణ స్వామి

వేంకటేశా.. గోవిందా..!

వైభవంగా పేట వేంకటేశ్వరుడి బ్రహ్మరథోత్సవం

వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు.. కలియుగవరదుడు పేట వేంకటేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారి మూల విరాట్‌కు వేకువజామునే అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం స్వామివారి చెంతకు మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల నడుమ కొల్హాపురమ్మ ఆలయంలో కొలువై ఉన్న అమ్మవారిని తోడ్కొని వచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి పూల పల్లకిలో తీసుకువెళ్లి.. రథంపైకి చేర్చారు. రథం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేలాది మంది భక్తుల గోవిందనామ స్మరణల నడుమ రథం ముందుకు కదిలింది. స్వామివారి రథోత్సవానికి భక్తులు పోటెత్తారు. బాలాజీ సేవా సమితి, వాసవీ క్లబ్ తదితర సేవాసంస్థలు.. భక్తులకు అన్నపానీయాలను అందించారు.



జనసందోహం నడుమ సాగుతున్న రథం



పల్లకిలో ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుడు



రథం వేగాన్ని నియంత్రించేందుకు మొద్దులను తీసుకెళ్తున్న దృశ్యం

పార్క్ చేస్తే బండి గోవిందా..!

వాహనాల చోరీకి అడ్డాగా 'పురం' రైల్వేస్టేషన్

నిఘా నేత్రం ఎక్కడ..?



హిందూపురం రైల్వే స్టేషన్

- లేపాక్షి మండలానికి చెందిన ఓ వ్యక్తి రెండు నెలల క్రితం బంధువులను రైలెక్కించడానికి వచ్చాడు. రైల్వేస్టేషన్ బయట ద్విచక్రవాహనాన్ని పార్క్ చేశాడు. అరగంట తర్వాత బంధువులను రైలెక్కించి వచ్చి చూసేసరికి వాహనం లేదు. రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్తే.. స్టేషన్ సమీపంలో వాహనాలు పార్కింగ్ ఉంది. అక్కడ కాకుండా స్టేషన్ వద్ద ఎవరు పార్క్‌చేయమన్నారంటూ ఎదురు ప్రశ్న వేయడంతో ఉసూరుమని వెళ్లిపోయాడు.
- నెల క్రితం ఓ ఉద్యోగి రైల్వే స్టేషన్ సమీపంలో చెట్టు కింద ద్విచక్ర వాహనాన్ని పార్క్‌చేసి అనంతపురానికి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి వాహనం లేదు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. అక్కడ పార్క్‌చేసినట్లు ఆధారాలు ఏమున్నాయని అడగడంతో మిన్నకుండిపోయాడు.
- 15 రోజుల క్రితం ఓ చిరు వ్యాపారి ద్విచక్రవాహనాన్ని పాత రైల్వే స్టేషన్‌వైపు పార్కుచేసి ఉదయం బెంగళూరుకు వెళ్లి మధ్యాహ్నం తిరిగి వచ్చాడు. అక్కడ చూసేసరికి ద్విచక్రవాహనం లేదు.

హిందూపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): హిందూపురం రైల్వే స్టేషన్ కొంతకాలంగా ద్విచక్రవాహనాల దొంగలకు అడ్డాగా మారిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉదయం వందలాది మంది కార్మికులు, చిరువ్యాపారులు రైల్వే స్టేషన్‌వద్ద పార్క్ చేసి అనంతపురం వెళ్లి వస్తుంటారు. అలాంటివారి వాహనాలు చోరీలకు గురవుతున్నాయి. దీంతో ఇక్కడ పార్క్ చేయాలంటే వాహనచోదకులు జంకుతున్నారు. ఏడాదిలో 15 ద్విచక్రవాహనాలు అపహరణకు గురైనట్లు తెలుస్తోంది. రెండు నెలల క్రితం పుట్టపర్తి ప్రాంతానికి చెందిన వాహనాల దొంగ రైల్వేస్టేషన్ వద్ద ఓ వాహనాన్ని ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా అక్కడున్నవారు గమనించి టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి తొమ్మిది వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రైల్వే స్టేషన్ వద్ద పార్కుచేసిన వాహనాలపైనే సదరు దొంగ కన్నేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ దొంగ ఒక్కడేకాదు.. ఇలాంటివారు చాలా మంది రైల్వే స్టేషన్‌వద్ద పార్క్ చేసిన వాహనాలను అపహరిస్తున్నారు. హిందూపురం రైల్వే స్టేషన్‌లో వాహనాలు పార్క్ చేయాలంటే జంకే పరిస్థితి నెలకొంది.

నిఘా నేత్రం ఎక్కడ..?

వాణిజ్య కేంద్రంగా పేరుగాంచిన హిందూపురం రైల్వేస్టేషన్ దశాబ్దాలుగా ఉంది. ఇక్కడికి రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపార నిమిత్తం వచ్చి వెళ్తుంటారు. సీసీ కెమెరాలు అధిక సంఖ్యలో పెట్టాల్సి ఉంది. అలాంటి నిఘా నేత్రం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో లేకపోవడంతో దొంగల పని ఈజీగా జరిగిపోతోంది. ఇతర చోరీలకు పాల్పడినవారు రైలెక్కి వెళ్తుంటారు. అలాంటి వారిని గుర్తించేందుకు నిఘా నేత్రం ఉండుంటే పోలీసులకు కొంతమేర ఆధారాలు దొరికేవి. ఇక్కడ సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగలు తమ పనిని సాఫీగా చేసుకుంటున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో ఇక్కడ కొన్ని కెమెరాలు ఉండేవి. ప్రస్తుతం అవి పనిచేస్తున్నాయో లేదో పోలీసులకే తెలియడంలేదు.

గంజాయి బ్యాచ్‌లకు అడ్డా

హిందూపురం రైల్వేస్టేషన్ గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఐదేళ్ల వైసీపీ హయాంలో హిందూపురంలో గంజాయి విక్రయాలు చిల్లర కొట్టు వరకు చేరాయి. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాల నుంచి హిందూపురానికి సరఫరాచేసేవారు. గతంలో గంజాయి రైళ్లలోనే సరఫరా జరిగేది. అక్కడ పనిచేస్తున్న కొంతమంది సిబ్బందితో సత్సంబంధాలు పెట్టుకున్న గంజాయి బ్యాచ్ వారి వ్యాపారాన్ని యథేచ్ఛగా సాగించింది. దీంతోపాటు రైల్వే స్టేషన్ ప్రాంతంలో సెల్యూషన్ బ్యాచ్‌కూడా ఉండేది. అర్ధరాత్రిపూట ఎవరైనా రైలుదిగి ఒంటరిగా వస్తుంటే కాపుకాసి దాడిచేసేవారు. ఇప్పటికైనా రైల్వే పోలీసులు స్పందించి ఇక్కడ జరిగే చోరీలకు చెక్‌పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పార్కింగ్ స్థలంలోనే ఉంచాలి: మహేష్, డీఎస్పీ



ఇతర ప్రాంతాలకు రైలులో వెళ్లేవారు స్టేషన్ బయట కాకుండా పార్కింగ్ స్థలంలో పార్క్ చేసి రసీదు పొందాలి. ఆ ప్రాంతంలో ఎవరిపైనైనా అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ముఖ్యంగా రైల్వే స్టేషన్ వెలుపల వాహనాన్ని పార్క్ చేసి చోరీకి గురైతే హిందూపురం టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వాలి. త్వరలో ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం.

రతనాల సీమగా మారుస్తాం

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద గంగపూజ
- మడకశిర ఉప కాలువకు నీటి విడుదల



గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద గంగపూజ చేస్తున్న మంత్రి

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాయలసీమను రతనాల సీమగా మార్చడమే సీఎం చంద్రబాబు ధ్యేయమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద హంద్రీనీవా అధికారులతో కలిసి ఆమె కృష్ణా జలాలకు గంగపూజ చేశారు. రిజర్వాయర్ నుంచి మడకశిర ఉపకాలువకు నీటిని విడుదల చేశారు. వైసీపీ హయాంలో చెరువులకు హంద్రీనీవా నీటిని అందించలేదని, దీంతో తాగు, సాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి అధికారంలోకి రాగానే యుద్ధప్రాతిపదికన హంద్రీనీవా కాలువకు మరమ్మతులు చేపట్టామని అన్నారు. హిందూపురం, మడకశిర, పెనుకొండ మండలాల్లో 265 చెరువులకు నీరు అందిస్తామని తెలిపారు. హంద్రీనీవా కాలువ విస్తరణ పనులను రూ.3,650 కోట్లతో త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఉచిత ఇసుక, మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇప్పటికే ఇస్తున్నామని, త్వరలోనే పేదలకు ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలను ప్రారంభిస్తామని అన్నారు. పట్టణ పేదలకు 2 సెంట్లు, గ్రామీణ పేదలకు 3 సెంట్లు స్థలం ఇస్తామన్నారు. లండన్‌కు వెళ్లి వైద్యం చేయించుకున్నా జగన్ మానసిక పరిస్థితి మెరుగుపడలేదనీ, 2.0, 3.0 అంటూ భ్రమలో బతికేస్తున్నారని ఎద్దేవా చేశారు. వైసీపీ చచ్చిపోయిందని స్వయంగా జగనే ఒప్పుకున్నారని, పార్టీ నుంచి ఒక్కో నాయకుడు వెళ్లిపోతుండటంతో మనోవేదనకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేశవయ్య, మునిమడుగు చిన్నవెంకటరాముడు, రామక్రిష్ణ, లక్ష్మీనారాయణ రెడ్డి, రఘువీరచౌదరి, రామలింగ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

లే అవుట్ల దందా..?

- అనుమతులు లేకుండానే ఏర్పాటు
- ల్యాండ్ కన్వర్షన్ చేసుకోకనే సైట్ల అమ్మకాలు
- బోర్డులు నాటినా పట్టించుకోని నిర్వాహకులు



యర్రగుంట పంచాయతీ పరిధిలో అక్రమ లేఅవుట్ వద్ద అధికారులు నాటిన హెచ్చరిక బోర్డు

బసవనపల్లి గ్రామ సమీపంలో అనధికార లే అవుట్



పరిగి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గ్రామ, పట్టణ ప్రాంతాల చుట్టూ వేసిన అక్రమ లేఅవుట్ల ద్వారా కొందరు రూ.లక్షలు గడిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పంటలు పండించుకునే భూములను సైతం తక్కువ ధరకు కొని రియల్ వ్యాపారంతో కోట్లకు పడగలెత్తుతున్నారు. మండలంలోని బసవనపల్లి, యర్రగుంట, గ్రామ, పంచాయతీ పరిధిలో అక్రమంగా లేఅవుట్లు వేసి, విక్రయించడం చర్చనీయాంశంగా మారింది. అనుమతులు తీసుకోవాలని పలు మార్లు సచివాలయ, పంచాయతీ కార్యదర్శులు కోరినా లేఔట్ల నిర్వాహ కులు స్పందించలేదు. ఇంటికి నోటీసులు పంపినా ప్రయోజనం లేదని అధికారులు పేర్కొన్నారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో సెంటు ధర దాదాపు రూ.నాలుగు లక్షలు, కాస్త పట్టణానికి దగ్గరగా ఉంటే రూ.ఆరు లక్షలు పైబడి ఉండటంతో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.

సైట్లు చూపకుండానే..

అక్రమంగా లేఅవుట్లు వేసిన వారు ఎక్కడో ఓ చోట కూర్చుని, ఫలానా చోట సైటు ఉంది. మీరు దాన్ని చూసి మావద్దకు వస్తే కాగితాలు మీకు అందిస్తామంటూ కొనుగోలుదారులకు చెబుతున్నారు. కొడికొండ-శిర జాతీయరహదారి సమీపంలో యర్రగుంట పంచాయతీ పరిధిలోని 97-1సర్వేనంబరులో ఐదెకరాలు పంచాయతీ అనుమతులులేకుండా లేఅవుట్లు వేశారు. హద్దులకు రాళ్లు నాటి విక్రయాలు ప్రారంభించారు. అయితే భవిష్యత్తులో ఇబ్బంది పడకుండా లేఅవుట్లపై సంబంధిత అధికారులు బోర్డులు నాటి కొనుగోలుదారులను హెచ్చరిస్తున్నారు. బసవనపల్లి గ్రామ సమీపంలో కొంతకాలం కిందట 277సర్వే నంబరులో ఏడెకరాల భూమిని కన్వర్షన్లు చేయించకుండానే లేఅవుట్లను వేశారు. సమీప భవిష్యత్తులో ఈ సైట్ల విలువ భారీగా పెరుగుతుందని ప్రచారం చేస్తూ అమాయకులకు అమ్మేస్తున్నారు. ఈ లేఅవుట్లలో సైట్లు కొనుగోలు చేస్తే నష్టపోతారని సంబంధిత అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

బోర్డులు నాటి హెచ్చరిస్తున్నాం -వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి



కొన్ని నెలలుగా యర్రగుంట పంచాయతీ పరిధిలో వేసిన అక్రమ లేఅవుట్ల విషయమై స్థల యజమానులకు పలుమార్లు ఫోన్లద్వారా తెలపాలని ప్రయత్నించాం. నోటీసులు పంపినా వారి నుంచి ఎటువంటి స్పందన రాలేదు. దీంతో ఆ స్థలంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు నాటించాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

'పురం' అభివృద్ధికి ప్రణాళికలు: కలెక్టర్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): హిందూపురం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో హిందూపురం శాసనసభ నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళిక, విజన్ అమలు, పాఠశాలల విలీనం, హౌసింగ్ లేఅవుట్లు, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, గ్రీవెన్స్‌సెల్‌కు వచ్చిన అర్జీల పరిష్కారం తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సూచనలు, సలహాలు తీసుకుని రాబోవు ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై సమగ్ర ప్రణాళికలు రూపొందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర-2047 పది సూత్రాలను కచ్చితంగా అమలు చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. జిల్లాలో 15శాతం వృద్ధి సాధించడానికి ప్రతి ఒకరు కృషి చేయాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వ భూమి లభ్యతను అధికారులు గుర్తించి శనివారంలోపు తనకు నివేదికలు అందించాలని ఆదేశించారు. హిందూపురం నియోజకవర్గానికి సంబంధించి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను ఆ నియోజకవర్గంలోని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యమైన పరిష్కారాలు చూపించాలన్నారు. లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో పింఛన్ల పంపిణీలో అధిక వ్యత్యాసాలున్నాయని, వాటిని సంబంధిత ఎంపీడీఓలు సమీక్షించాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఈఓ కిష్టప్ప, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, టిడ్కో ఈఈ సుధారాణి, హిందూపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

కుంభమేళాకు ఆర్టీసీ బస్సులు

15, 25 తేదీల్లో ప్రయాణం




హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళకు హిందూపురం నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఈ నెల 15, 25 తేదీలలో ప్రత్యేక లగ్జరీ బస్సులు బయలుదేరుతాయని, 4 వేల కిలో మీటర్ల ప్రయాణానికి కేవలం రూ.9వేలు చార్జీ నిర్ణయించామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఎనిమిది రోజుల యాత్రలో ప్రయాగ్‌రాజ్, అయోధ్య, కాశీ మహా పుణ్య క్షేత్రాలు, మరిన్ని ఆలయాలను సందర్శించేలా ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ శ్రీకాంత్ కోరారు.

నేను వెళుతున్నా..



మహాకుంభమేళా 144 సంవత్సరాలకు ఒకసారి వస్తుంది. అందుకే ఎంత కష్టమైనా వెళ్లి త్రివేణి సంగమంలో పుణ్యస్నానం చేయాలని అనుకుంటున్నాను. పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలని ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. నాతోపాటు మరికొందరు వస్తున్నారు.

-శివరాజ్, తాపీమేస్త్రీ, హిందూపురం



జ్యోతి దర్శనం చేసుకుంటున్న భక్తులు (ఇన్‌సెట్‌లో స్వామివారు)

అఖండ భక్తి జ్యోతి

కొండమీదరాయుడి సన్నిధిలో.. తొలిసారి

అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం సమీపాన కొండమీదరాయుడు వెలసిన దేవరకొండపైన తొలిసారి అఖండ జ్యోతిని వెలిగించారు. స్వామి రథోత్సవంలో భాగంగా ఆలయ కమిటీ అధ్వర్యంలో దాదాపు 300 కేజీల ఆవు నెయ్యిని వినియోగించి అఖండ దీపాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం 6:45 నిమిషాలకు అఖండజ్యోతిని వెలిగించారు. దాదాపు 1300 మీటర్ల ఎత్తు ఉన్న కొండపై ఏర్పాటు చేయడంతో చుట్టూ 30 కి.మీ. పరిధిలో ప్రజలకు జ్యోతి కనిపించింది. ఇకపై ఏటా కొండమీదరాయుడు రథోత్సవం రోజున భక్తులకు అఖండ జ్యోతి దర్శనం కల్పిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, బుక్కరాయసముద్రం





పున్నమి చందురుడికి అఖండ జ్యోతి హారతులు

నాసిరకం భోజనంపై ఆగ్రహం

- హాస్టల్ మెస్ చార్జీలు తగ్గించాలని డిమాండ్
- సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల ధర్నా



వీసీ చాంబర్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఏబీవీపీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నాసిరకం భోజనం పెడుతున్నారని సెంట్రల్ యూనివర్సిటీ హాస్టల్ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉడికీఉడకని ఆహారం పెడుతున్నారని, దీని వల్ల అనారోగ్యంబారిన పడుతున్నామని బుధవారం జంతులూరు గ్రామం వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులతో పాటు ఏబీవీపీ నాయకులు ఆందోళనకు దిగారు. సెంట్రల్ యూనివర్సిటీలో 750 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. హాస్టల్లో నాసిరకం భోజనం పెడుతుండడంతో వైస్ చాన్స్‌లర్ చాంబర్ ఎదుట అందోళనకు దిగారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యార్థులు నిరసన కొనసాగించారు. అన్నం ఉడకడం లేదని, పురుగులుతో కూడిన కూరలు పెడుతున్నారని మండిపడ్డారు. రోజుకు రూ.105 చొప్పున మెస్‌కు చెల్లిస్తున్నామని అన్నారు. ఇంత డబ్బు తీసుకుని నాసిరకం భోజనం పెడుతుండడంతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని విద్యార్థులు వాపోయారు. ఇతర కేంద్రీయ విశ్వవిద్యాలయాల కంటే ఇక్కడ మెస్‌చార్జీలు ఎక్కువగా వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఉదయం విద్యార్థులకు పెట్టిన ఇడ్లీలు ఉడకలేదని బహిష్కరించారు. సెమిస్టర్ ఫీజులు కూడా తగ్గించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. వసతి గృహాల్లో మెరుగైన ఇంటర్‌నెట్, వేడి నీరు, 24 గంటల నీటి వసతి, నిరంతరమైన విద్యుత్ తదితర మౌళిక సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. డీన్ రామిరెడ్డి వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. వారి డిమాండ్లను వీసీతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

బీటెక్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల ఫలితాలు విడుదల చేశామని బుధవారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్‌నాయుడు తెలిపారు. డిసెంబరులో ప్రథమ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించామని అన్నారు. నాల్గవ సంవత్సరం విద్యార్థులకు ప్రథమ సెమిస్టర్ (ఆర్15,19), తృతీయ సెమిస్టర్ (ఆర్15,19,20) సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. విద్యార్థులు ఫలితాలకోసం జేఎన్టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో సీఈ శివకుమార్, ఏసీలు రాజేశేఖర్, అంకారావు, శ్రీధర్ పాల్గొన్నారు.

ధ్రువపత్రాల జారీలో అవకతవకలు

ఎముకల వైద్యుడిపై విచారణ



శ్రీకాంత్‌రెడ్డిని విచారిస్తున్న ఉన్నతాధికారులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సదరం సర్టిఫికెట్ల మంజూరులో అవకతవకలు జరిగాయనే ఫిర్యాదుపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు బుధవారం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. అమరావతి నుంచి వచ్చిన సివిల్ సర్జన్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగలక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో ఎముకల వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్‌రెడ్డిపై వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌కు ఫిర్యాదులు వచ్చాయన్నారు. విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. ఇటీవల సదరం క్యాంపునకు వచ్చిన వారిలో కొంత మందితో డబ్బు వసూలు చేసి సర్టిఫికెట్లు ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న ఓ మహిళ ఇటీవల హిందూపురంలో సదరం క్యాంపునకు వచ్చినట్లు సమాచారం. ఆర్థో డాక్టర్ డబ్బు డిమాండ్ చేశారని దీనిపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి, కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై స్పందించిన వైద్యఆరోగ్యశాఖ విచారణకు నాగలక్ష్మితోపాటు బయో మెడికల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సోమేశ్వరరావును పంపింది.

ఆస్పత్రి పారిశుధ్య కార్మికుల సమ్మెబాట

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రి, వైద్య కళాశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు అందలేదు. కలెక్టర్, జేసీ, వైద్యాధికారులను కలిసి వినతులు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. చివరకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను కలిసి వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నా మని న్యాయం చేయాలని కోరారు. కానీ కాంట్రాక్టర్ నుంచి వేతనాలు అందలేదు. దీంతో ఆస్పత్రి పారిశుధ్య కార్మికులు జీతం కోసం పోరుబా ట పట్టారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం నుంచి సమ్మెకు వెళుతున్నారు. ఇప్పటికే ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావును కలిసి సమ్మెనోటీస్ అందజేశారు. దీంతో గురువారం నుంచి ఆస్పత్రిలో పారిశుధ్య పనులు నిలిచిపోనున్నాయి.

డ్రిప్.. స్ప్రింక్లర్లు తెచ్చింది చంద్రబాబే

ఎమ్మెల్యే పరిటాల సునీత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీత

రాప్తాడు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నీటి వనరులు తక్కువగా ఉన్న జిల్లాలో సీఎం చంద్రబాబు డ్రిప్, స్ప్రింక్లర్లను అందుబాటులోకి తెచ్చారని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల రైతులకు సబ్సిడీపై మంజూరైన డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలను ఆమె బుధవారం పంపిణీ చేశారు. మూడు మండలాలలో 840 మంది రైతులకు పరికరాలు మంజూరు కాగా, రాప్తాడులో 214 మంది రైతులకు రూ.2.60 కోట్ల విలువైన సామగ్రిని ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కరువుతో అల్లాడిపోతున్న జిల్లాకు అప్పట్లోనే సీఎం చంద్రబాబు డ్రిప్, స్ప్రింక్లర్లను తెచ్చారని, వాటిని వినియోగించి రైతులు తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేశారని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పరికరాలను ఇవ్వలేదని, దీంతో రైతులు మార్కెట్‌లో కొని ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఎన్నికల ముందు, వైసీపీ మద్దతుదారులలో కొందరికి పరికరాలను ఇచ్చారని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రాజకీయాలకు అతీతంగా రైతులందరికీ సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్లు అందిస్తున్నామని అన్నారు. అనంతరం మూడు మండలాలలో 129 మందికి పెరటి కోళ్ల పెంపకం యూనిట్లు పంపిణీ చేశారు. పెరటి కోళ్ల పెంపకం ద్వారా ఇంటి వద్దనే ఉపాధి పొందవచ్చని ఎమ్మెల్యే అన్నారు. ఒక యూనిట్ విలువ రూ.6 వేలు కాగా సబ్సిడీపై రూ.3,600 అందించారు.

ప్రకాష్ రెడ్డి కక్షలు సృష్టిస్తున్నారు..

అధికారంలో ఉన్నప్పుడు గ్రామాలకు రోడ్లు కూడా వేయని ప్రకాష్‌రెడ్డి అధికారం పోయాక గ్రామాల్లో రాజకీయ కక్షలు సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక రూ.30 కోట్లతో సీసీ రోడ్లు వేశామని, త్వరలో మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. కనగానపల్లి మండలం గుంతపల్లిలో వ్యక్తిగత కారణాలతో ఇద్దరు గొడవ పడితే అది పరిటాల కుటుంబంపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఆ ఘర్షణలో ఇరువర్గాలవారు గాయపడ్డారని, ఆ మేరకు కేసులు నమోదయ్యాయన్నారు. అందులో పరిటాల కుటుంబం ప్రమేయం లేదని అన్నారు. ప్రకాష్‌రెడ్డి ఇంటి వద్దకు ఎవరూ వెళ్లకపోవడంతో, వైసీపీ శ్రేణులను తన వైపు తిప్పుకునేందుకు పరిటాల కుటుంబాన్ని లాగుతున్నారని విమర్శించారు. ఆయన ట్రాప్‌లో పడితే వైసీపీ శ్రేణులు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రకాష్‌రెడ్డి పద్ధతి మారకపోతే ఆయనపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ రఘునాథ రెడ్డి, ఏపీడీ ఫిరోజ్ ఖాన్, ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్, తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ విజయలక్ష్మి, మండల కన్వీనర్లు కొండప్ప, శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, రఘు, మాజీ ఎంపీటీసీ సాయినాథ్‌నాయుడు, సర్పంచ్‌లు తిరుపాలు, శీనయ్య, ఉజ్జినప్ప, ఎంపీటీసీలు జాఫర్, రవి, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లను పునరుద్ధరించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్



డీఆర్‌ఎంకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గుంతకల్లు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో నిలిపివేసిన రైళ్లను పునరుద్ధరించాలని డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తాను సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ కోరారు. డీఆర్‌ఎం కార్యాలయానికి బుధవారం సీపీఐ నాయకులు వెళ్లారు. కరోనాకు ముందు ఉన్న గుంతకల్లు-బళ్లారి, యశ్వంతపూర్-విజయవాడ ప్యాసింజరు రైళ్లను, హుబ్లీ-విజయవాడ రైలును పునరుద్ధరించాలని కోరారు. యశ్వంతపూర్-టాటానగర్ ఎక్స్‌ప్రెస్‌ను గుంతకల్లు బైపాస్ నుంచి నడుపుతున్నారని, స్టేషన్‌లోకి తీసుకురావాలని కోరారు. విశాఖపట్టణం, గుంతకల్లు రైల్వే డివిజన్లు కోతకు గురైన కారణంగా సౌత్ కోస్టు రైల్వే జోన్‌కు ఆదాయం తగ్గిపోతుందని అన్నారు. గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో 24 బోగీలు నిలిచే స్థాయి ప్లాట్‌ఫారం లేకపోవడం శోచనీయమని, వెంటనే ప్లాట్‌ఫారాల నిడివిని పెంచడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. గుంతకల్లులో రైలు కోచ్ మెయింటెనెన్స్ డిపోను నిర్మించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డీఆర్‌ఎంకు వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఐ నాయకులు గోపీనాథ్, ఎస్‌ఎండీ గౌస్, రాము రాయల్, దేవేంద్రప్ప కార్యక్రమంలో పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని కో-ఆర్డినేటర్ జయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బాలుర, బాలికల గురుకులాలకు సంబంధించి మార్చి 6వ తేదీ వరకూ https://apb ragcet.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని అన్నారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష మార్చి 4వ తేదీ ఉదయం 10 గంటలకు, ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష మార్చి 6వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహిస్తామని తెలిపారు.

ఖాళీల వివరాలు...

అనంతపురం జిల్లా...

పాఠశాల/కళాశాల	5వ తరగతి	ఇంటర్మీడియట్
కురుగుంట బాలికల గురుకుల కళాశాల/పాఠశాల	80	సీఈసీ-80
తిమ్మాపురం బాలికల గురుకుల పాఠశాల/కళాశాల	80	ఎంపీసీ/బైపీసీ-80
కణేకల్లు బాలుర గురుకుల పాఠశాల/కళాశాల	80	ఎంపీసీ/బైపీసీ-80
ఉరవకొండ బాలికల పాఠశాల/కళాశాల	80	ఎంపీసీ/సీఈసీ-80
బి. పప్పూరు బాలుర పాఠశాల/కళాశాల	80	ఎంపీసీ/బైపీసీ-80
కురుగుంట బాలికల జూనియర్ కళాశా	---	ఎంపీసీ/బైపీసీ-160
గుత్తి బాలికల పాఠశాల/కళాశాల	80	ఎంపీసీ/బైపీసీ-80
బ్రహ్మసముద్రం బాలికల పాఠశాల/కళాశాల	80	హెచ్ఈసీ/సీఈసీ-80
కొర్రపాడు బాలికల పాఠశాల	80	---------------
మొత్తం	640	720
సత్యసాయి జిల్లా		
కాళసముద్రం బాలుర కళాశాల/పాఠశాల	80	ఎంపీసీ/బైపీసీ-80
మలుగూరు బాలుర కళాశాల/పాఠశాల	80	ఎంపీసీ/బైపీసీ-80
నల్లమాడ బాలికల కళాశాల/పాఠశాల	80	హెచ్ఈసీ/సీఈసీ-80
అమరాపురం బాలికల కళాశాల/పాఠశాల	80	ఎంపీసీ/బైపీసీ-80
హిందూపురం బాలికల కళాశాల/పాఠశాల	80	ఎంపీసీ/బైపీసీ-80
రొళ్ల బాలుర పాఠశాల	80	---------------
హిందూపురం బాలుర పాఠశాల	80	---------------
మొత్తం	560	400

బీసీ గురుకులాలలో..

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకులాల్లో 5,6,7,8,9 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆ గురుకులాల జిల్లా కన్వీనర్ జోనతన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో https://mjpapbcwreig.apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ నెల 15 నుంచి మార్చి 15వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. 5వ తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 27న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. 6,7,8,9 తరగతులకు ఏప్రిల్ 28న, ఇంటర్‌కు ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్షలు ఉంటాయన్నారు.

హాకీ పోటీలకు ఎంపిక



శ్రీనివాసులు

విడపనకల్లు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ జట్టుకు ఎంపికయినట్లు పాఠశాల ప్రధానోపధ్యాయురాలు సర్వ మంగళ తెలిపారు. నవంబరు నెలలో విజయవాడలో నిర్వహించిన సెలెక్షన్స్‌లో పీడీ శ్రీనివాసులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ఎంపిక అయ్యారని పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి 28 వరకూ కాకినాడలో జరిగే ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలలో పాల్గొంటారని అన్నారు. పీడీ శ్రీనివాసులును బుధవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు.

అంతా నా ఇష్టం..!

వెనక్కు తగ్గని బీసీ సంక్షేమ శాఖ అధికారి

- విచారణ అధికారి ఎదుట నోరు విప్పొద్దని హుకుం
- ఆ వార్డెన్‌లకు సుదూరపు బాధ్యతల తొలగింపు
- కలెక్టర్ అనుమతి లేకుండా ఇతరులకు బాధ్యతలు



అనంతపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమశాఖ అధికారిగా శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న ఆ అధికారి అంతా తన ఇష్టమన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వార్డెన్లకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. డైట్ బిల్లుల్లో పర్సంటేజీలు తీసుకున్నారు. ఈ అంశాలపై ఆంధ్రజ్యోతిలో 'అదనపు బాధ్యతలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో ఆ శాఖ మంత్రి సవిత, ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ స్పందించారు. ఆ అధికారిపై వచ్చిన ఆరోపణలపై నిగ్గు తేల్చాలని ఆ శాఖ జాయింట్ డైరెక్టర్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆ అధికారి విచారణను చేపట్టకముందే, చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఆ అధికారి తప్పు మీద తప్పులు చేస్తున్నారు. ఒక్కో వార్డెన్‌కు సుదూర ప్రాంతంలో ఉన్న మూడు వసతిగృహాల బాధ్యతలను ఇచ్చారు. ఇది ఆ వార్డెన్‌లకు భారం. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. ఆ శాఖ ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. దీంతో వెంటనే ఆ వార్డెన్లకు సుదూరంలో ఉన్న వసతిగృహాల అదనపు బాధ్యతలు తప్పించాలని జూమ్ మీటింగ్‌లో ఆదేశించారు. ఇంత వరకూ బాగుంది. వార్డెన్లను ఆ బాధ్యతల నుంచి తొలగించేందుకు వెంటనే ఉత్తర్వులు జారీ చేశారు. వసతి గృహాల అదనపు ఇన్‌చార్జ్ బాధ్యతలను సమీపంలోని ఎస్సీ సంక్షేమశాఖ వార్డెన్లకు అప్పగిస్తూ.. జారీ చేసిన ఉత్తర్వుల్లో రెఫరెన్స్ కింద ఆ శాఖ డైరెక్టర్ ఆదేశించారని పేర్కొన్నారేగాని, ఎక్కడా జిల్లా కలెక్టర్‌కు సమాచారం ఇచ్చినట్లుగాని, అనుమతి లభించినట్లుగాని ఉత్తర్వుల్లో పొందుపరచలేదు. ఏ చిరుద్యోగిని తొలగించినా, ఉద్యోగంలోకి తీసుకోవాలన్నా, అదనపు బాధ్యతలను అప్పగించాలన్నా కలెక్టర్ అనుమతి తప్పనిసరిగా ఉండాలి. కానీ బీసీ సంక్షేమశాఖలో ఆ అధికారి సొంత నిర్ణయంతో ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించడం ఆ శాఖలో హాట్ టాపిక్‌గా మారింది.

గుట్టు రట్టు చేస్తే వేటే...

తన అవినీతి, అక్రమాలను ఎవరైనా బయటపెడుతున్నట్లు అనుమానం వస్తే వేటు వేయడానికి ఏమాత్రం వెనుకాడరు. ఆ అధికారి గుట్టు రట్టు చేస్తే వార్డెన్లకు వేటు తప్పదని అంటున్నారు. కదిరి డివిజన్‌లో పనిచేసే ఓ వార్డెన్‌కు అదనంగా అదే డివిజన్‌లో రెండు వసతిగృహాల బాధ్యతలను అప్పగించారు. అదే వార్డెన్ తన వ్యవహారశైలి గురించి ఇతర అధికారుల వద్ద ప్రస్తావిస్తున్నారని అనుమానం రాగానే.. అందుబాటులో లేడనే సాకుతో చార్జ్‌మెమోలు జారీ చేశారు. విజిట్ పేరుతో ఇలా పలుమార్లు చార్జ్‌మెమోలు జారీ చేశారని సమాచారం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సస్పెండ్ చేయించారని అంటున్నారు. ఆ అధికారి తీరుతో విసిగిన వార్డెన్.. మెడికల్ లీవ్‌లో వెళ్లిపోయారు. అదే అదునుగా సస్పెండ్ చేయించారని అంటున్నారు.

వ్యతిరేకంగా చెప్పొద్దు..

తన అవినీతి, అక్రమాలు, వ్యవహార శైలిపై ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడిన నేపథ్యంలో.. ఆ శాఖ మంత్రి సవిత, ఆ శాఖ డైరెక్టర్ మల్లికార్జున సీరియస్ అయ్యారు. విచారణకు ఆదేశించారు. జాయింట్ డైరెక్టర్‌ను విచారణాధికారిగా నియమించారు. విచారణకు జాయింట్ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి త్వరలో జిల్లాకు వస్తున్నారు. ఆయన వద్ద తన వ్యతిరేకంగా చెప్పొద్దని తన అనుకూల వార్డెన్లు, ఏబీసీడబ్ల్యూఓకు హుకుం జారీ చేసినట్లు తెలిసింది. ఆ అధికారికి అనుకూల వార్డెన్లు, ఆ ఏబీసీడబ్ల్యూఓ పనిగట్టుకొని డివిజన్ల వారీగా.. మిగిలిన వార్డెన్లకు హితబోధ చేస్తున్నట్లు సమాచారం.



Proceedings of the District B.C.Welfare ... Officer, Sri Sathya Sai District
Present: ...
Rc.No.A/65/2024 Dt: 11.02.2025.

Sub: BCWD – Sri Sathya Sai ... of certain internal alternative arrangements ... on administrative convinience – Orders – Requested – Regarding.

Ref: Oral instructions of the Director, B.C.Welfare, A.P., Vijayawada on FRS attendance, dt: 11.02.2025.

ORDER:

It is informed that, FRS attendance to the hostel boarders is to be fixed with hostel diet bills from February Month. Hence it is not possible for the Hostel Welfare Officer who is holding additional 2 hostel duties to implement the 100% FRS attendance to the hostel boarders on daily basis and for which, for effective and smooth functioning of the hostels, to avoid the situation, it is necessary to make certain alternative arrangements among vacant hostels in Sri Sathya District.

Keeping in view of the circumstances reported vide ref read above, and the position of the HWOs working in the District, the following alternative arrangements are made due to administrative convenience in B.C.Pre Matric Hostels and for effective implementation of FRS attendance and Menu as per Ms. No.8 SW (SW.EDN.2) Dept.dt: 20-02-2023 and to implement the Post Matric Scholarships & Reimbursement of tuition fee.

Therefore, the following Hostel Welfare Officers are hereby kept full additional charge to the posts of vacant Hostel Welfare Officers in Sri Sathya Sai District until further orders.

Sl. No	Name of the Hostel	Name of the HWO working at present to the vacant Hostel	Name of the HWO proposed to be kept as FAC to the vacant HWO post
1	2	3	4
[illegible]	Govt B.C.Boys Hostel [illegible]	Smt G.Lalithamma	Sri K.[illegible] Naik, HWO (SGT Teacher) Ashram High School, Nallamada
2	Govt B.C.College Boys Hostel, Bukkapatnam	Sri A.P.Gopal	Sri T.Vijay Kumar, HWO, S.C.Boys Hostel, Puttaparthi
3	Govt B.C.Boys Hostel Chilamathur	Sri C.Obula Reddy	Sri S.Chand Basha, HWO, S.C.Boys Hostel, Chilamathur

జిల్లా కలెక్టర్ నోట్(అనుమతి) ప్రస్తావన లేకుండా వార్డెన్లకు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ ఆ అధికారి విడుదల చేసిన ఉత్తర్వు

క్రైం కార్నర్

గుత్తి ఆర్‌ఎస్‌లో సైకో వీరంగం

● దేహశుద్ధి చేసిన స్థానికులు



సైకోను తాళ్లతో కట్టేసిన స్థానికులు

గుత్తి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్‌ఎస్‌లో బుధవారం ఓ సైకో వీరంగం సృష్టించాడు. నడిరోడ్డుపై బట్టలు విప్పి నగ్నంగా తిరుగుతూ దుకాణాలపై రాళ్లు విసురుతూ జనాలను భయభ్రాంతులను చేశాడు. పత్తికొండ రోడ్డు సర్కిల్లో ఓ మటన్‌దుకాణంపై దాడికి పాల్పడేందుకు ప్రయత్నించగా స్థానికులు పట్టుకున్నారు. దేహశుద్ధి చేసి కాళ్లు చేతులు కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆ సైకోను వాహనంలో తీసుకెళ్లి ఇతర ప్రాంతానికి తరలించారు. దీంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. దాదాపు అరగంటపాటు సైకో వీరంగం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అతడు తిరుపతికి చెందినవ్యక్తి అని సమాచారం.

వెంటాడిన మృత్యువు



రామాంజనేయులు (ఫైల్)

కుందుర్పి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలిమిపాల్యం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బోయ రామాంజనేయులు (53)ను మృత్యువు వెంటాడింది. ఇంటి పైనుంచి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా.. రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు వెంటాడింది. వారం రోజులపాటు పోరాడి చివరకు ప్రాణం విడిచాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బోయ రామాంజనేయులు కూలి పనులకు వెళ్లుండేవాడు. అతడికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు అనిల్ ఉన్నారు. ఈనెల 4వ తేదీన ఇంటి పైకప్పు మీద ఉన్న కోడిపెంటను శుభ్రం చేస్తుండగా.. ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. నడుము వద్ద తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు. 5వ తేదీన తెల్లవారుజామున మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు అంబులెన్సులో కర్నూలుకు తరలిస్తుండగా వెల్దుర్తి సమీపంలో టోల్ ప్లాజా వద్ద రోడ్డు సూచికను ఢీకొట్టారు. ప్రమాదంలో రామాంజనేయులుకు తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్ డ్రైవర్‌తోపాటు రామాంజనేయులు భార్య లక్ష్మీదేవి, కుమారుడు అనిల్, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామాంజనేయులు మంగళవారం మృతిచెందాడు. కర్నూలు జిల్లా కృష్ణగిరి పోలీసులు బుధవారం కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

లేపాక్షి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన రైతు నరసింహమూర్తి(32) బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నరసింహమూర్తి గ్రామంలో వ్యవసాయంతోపాటు కూలిపని చేసుకుంటూ జీవించేవాడు. ఇటీవల ఫైనాన్స్‌లో ద్విచక్ర వాహనం కొనుగోలు చేశాడు. దానికి కంతులు కట్టకపోవడంతో మూడు రోజుల కిందట వాహనాన్ని ఫైనాన్స్ వారు తీసుకెళ్లారు. దీంతో జీవితంపై విరక్తిచెంది బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి దగ్గరలోనే ఉన్న చింతచెట్టుకు ఉరి వేసుకున్నాడు. గమనించిన స్థానికులు ఉరికి వేళాడుతున్న అతడిని కిందకి దించి పరీక్షించగా మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి భార్య, తల్లిదండ్రులు ఉన్నారు. భార్య శోభ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా మృతుడికి దాదాపు రూ.ఐదారు లక్షలు అప్పులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

నేలకోట తండాలో కూలీ..

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలకోటతండాకు చెందిన వ్యవసాయ కూలీ నాగభూషణనాయక్(50) బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన మేరకు నాగభూషణనాయక్ వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. రెండురోజుల కిందట భార్య కృష్ణమ్మబాయి తమ కుమార్తె ఇంటికి వెళ్లడంతో మనస్తాపం చెంది పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గమనించి ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి, మృతి చెందినట్లు నిర్ధారించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, శవాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ప్రింటింగ్ ప్రెస్ యజమాని..

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై.. మనస్తాపంతో ఓ ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపిన మేరకు.. నగరంలోని కమలానగర్‌లో చంద్రశేఖర్ (50) భవాని ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తున్నాడు. మద్యానికి అలవాటు పడిన చంద్రశేఖర్‌కు కుటుంబ సభ్యులు మానుకోవాలని సూచించేవారు. ఈ క్రమంలో బుధవారం కింద ప్రింటింగ్ ప్రెస్‌లో భార్య, ఇతర కుటుంబసభ్యులు ఉండగా పై గదిలోకి వెళ్లిన చంద్రశేఖర్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో పడి యువకుడి మృతి

చిలమత్తూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుస్సేన్ పురంలో నాగరాజు (32) ప్రమాదవశాత్తు పాడుబడిన బావిలో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు నాగరాజు కూలి పనులు చేసుకుంటూ ఉండేవాడని, అందులో భాగంగా మంగళవారం కూలి పనికి వెళ్లాడన్నారు. అయితే పనిచేస్తున్న చోట బహిర్భూమికి వెళుతున్నట్లు అక్కడున్న వారికి చెప్పి వెళ్లాడన్నారు. అయితే అతను ఎంత సేపటికి రాకపోవడంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేకపోయింది. అయితే బుధవారం ఉదయం పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లిన వారికి పాడుబడిన బావిలో శవమై కనిపించడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి తండ్రి శివప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

టమోటా కిలో రూ.10

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.10తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు.

ఉద్యోగోన్నతి కోసం.. నిరీక్షణ..!



● ఐదేళ్లుగా వార్డెన్ల ఎదురుచూపు

● ఒకరి వల్ల పది మందికి ఇబ్బందులు

● ఎస్సీ సంక్షేమశాఖలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యం

అనంతపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఏ ప్రభుత్వ శాఖలోనైనా ఉద్యోగికి అంచలంచెలుగా పదోన్నతులు ఉంటాయి. పదోన్నతి ద్వారా హోదా, జీతంతో పాటు ఇతర అలవెన్సులు వల్ల లబ్ధి చేకూరుతుంది. ఎస్సీ సంక్షేమశాఖలో ఉద్యోగోన్నతి విషయంలో ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కలెక్టర్‌కు మొర పెట్టుకున్నా ఆ ఉద్యోగులకు న్యాయం జరగడం లేదు. ఎన్నేళ్లిలా ఉద్యోగోన్నతి కోసం నిరీక్షించాలో బదులిచ్చే నాథుడే కరువయ్యారు. ఎస్సీ సంక్షేమశాఖలో ఉమ్మడి అనంత జిల్లాలో పనిచేస్తున్న 10 మంది వార్డెన్ల ఉద్యోగోన్నతి విషయంలో ఉన్నతాధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ శాఖ నిబంధనల మేరకు వార్డెన్లకు గ్రేడ్-1 వార్డెన్(ఏఎస్‌డబ్ల్యూఓ)గా ఉద్యోగోన్నతి పొందడానికి అర్హులు. ఉద్యోగోన్నతి పొందాలంటే తప్పనిసరిగా బీఈడీ పూర్తి చేసి ఉండాలి. సీనియార్టీ జాబితాలో ఉన్న 10 మంది వార్డెన్లు బీఈడీ పూర్తి చేశారు. అదే శాఖలో పనిచేస్తున్న క్లాస్-4 ప్రమోటెడ్ వార్డెన్ తనకూ గ్రేడ్-1 వార్డెన్‌గా ఉద్యోగోన్నతి కల్పించాలంటూ కోర్టును ఆశ్రయించాడు. అతడు సీనియార్టీ జాబితాలో 30వ స్థానంలో ఉండటంతో పాటు... ఆ శాఖ నిబంధనల మేరకు బీఈడీ అర్హత లేదని ఆ శాఖ అధికారులే స్పష్టం చేస్తున్నారు. అర్హత లేకపోయినా గ్రేడ్-1 ఉద్యోగోన్నతి కల్పించాలని కోర్టుకు వెళ్లిన వార్డెన్‌ను సాకుగా చూపుతూ మిగిలిన వారికి అన్యాయం చేసే విధంగా ఆ శాఖ ఉన్నతాధికారులు వ్యవహరిస్తుండటం విమర్శలకు దారితీస్తోంది.

ఆ ఇద్దరు అధికారుల వ్యవహారమే శాపమా...?

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 10 మంది వార్డెన్లకు ఉద్యోగోన్నతులు రాకపోవడానికి గతంలో ఆ శాఖ ఉన్నతాధికారులుగా పనిచేసిన ఇద్దరి నిర్వాకమే ప్రధాన కారణమని తెలుస్తోంది. ఆ ఉన్నతాధికారుల వ్యవహారశైలితో 10 మంది వార్డెన్లకు శాపంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో పనిచేసిన ఆ ఇద్దరు ఉన్నతాధికారులు మహిళా, పురుష ఉద్యోగుల సీనియార్టీ జాబితాను వేర్వేరుగా రూపొందించడంతోనే సమస్య ఉత్పన్నమైందని తెలుస్తోంది. వారిద్దరి ప్రోత్సాహంతోనే ఓ వార్డెన్ కోర్టును ఆశ్రయించారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ ఇద్దరు అధికారుల తీరుపై రాష్ట్రస్థాయి అధికారులు సీరియస్ అయ్యారని సమాచారం. వేర్వేరుగా పదోన్నతుల సీనియార్టీ జాబితాను రూపొందించడంపై విచారణకు ఆదేశించారు. ఆ క్రమంలోనే ఆ రెండు జాబితాలను రద్దు చేశారు. ఇదిలా ఉండగా.. గ్రేడ్-1 వార్డెన్ ఉద్యోగోన్నతి కల్పించాలని కోర్టును ఆశ్రయించిన కేసు విచారణకు వచ్చింది. ఆ సమయంలో ఆ శాఖ రాష్ట్ర అధికారులైనా... జిల్లా ఉన్నతాధికారులైనా పట్టించుకొని కౌంటర్ ఫైలు చేసి ఉంటే... 10 మంది వార్డెన్లకు గ్రేడ్-1 ఉద్యోగోన్నతులు కలిగేవి. ఆ శాఖ రాష్ట్రస్థాయి అధికారులు, జిల్లా అధికారులు ఆ విషయంలో మీనమేషాలు లెక్కించడంతో ఐదేళ్లు గడుస్తున్నా... వారికి కోసం ఎదురుచూపులే మిగిలాయి.

కలెక్టర్‌కు సర్వాధికారాలున్నా...

ఉద్యోగోన్నతుల విషయంలో జిల్లా కలెక్టర్‌కు సర్వాధికారాలు ఉంటాయి. ఒక్కరి కోసం... 10 మంది వార్డెన్లకు ఉద్యోగోన్నతులు కల్పించే విషయంలో నిర్ణయం తీసుకోలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఉద్యోగోన్నతి కల్పించాలని విజ్ఞప్తి చేస్తూ స్పందనలో కలెక్టర్‌కు పలుమార్లు మొర పెట్టుకున్న సందర్భాలు లేకపోలేదు. లిఖితపూర్వకంగా వినతులు సమర్పించినా.. వారి మొర ఆలకించకపోగా.. జీపీ నివేదిక తీసుకురావాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు ఆ శాఖ అధికారులతో కలిసి ఆ 10 మంది వార్డెన్లు జీపీ నివేదికను కలెక్టర్‌కు అందజేసినట్లు సమాచారం. గ్రేడ్-1 పదోన్నతులు కల్పించేందుకు ఆ 10 మంది వార్డెన్లు అర్హులని అందులో స్పష్టంగా పేర్కొన్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ.. ఉద్యోగోన్నతి కోసం కోర్టుకెళ్లిన ఆ వార్డెన్ కేసు విత్‌డ్రా చేసుకుంటే సమస్య పరిష్కరిస్తామని స్వయంగా కలెక్టరే తేల్చి చెప్పినట్లు బాధిత వార్డెన్ల ద్వారా తెలుస్తోంది. కోర్టుకెళ్లిన ఆ క్లాస్-4 వార్డెన్ మాత్రం కేసు వెనక్కు తీసుకునేది లేదని భీష్మించుకు కూర్చోవడంతో చిక్కుముడి వీడలేదు. ఇక్కడ మరో విషయం తెరపైకి వస్తోంది. ఆ పదిమందిలో వరుసగా సీనియార్టీ జాబితాలో 9 సంఖ్య వరకూ ఉన్న వారికి గ్రేడ్-1 వార్డెన్లుగా పదోన్నతి కల్పించి ఆఖరి వార్డెన్‌కు ఆపడం వల్ల... ఆ 9 మందికైనా న్యాయం జరుగుతుందనే వాదన ఆ వర్గాల నుంచి వినిపిస్తోంది. తర్వాత కోర్టు తీర్పు ఎవరికి అనుకూలంగా వస్తే... ఆ వార్డెన్‌కు ఉద్యోగోన్నతి కల్పించవచ్చని అంటున్నారు. ఇతర జిల్లాల్లో ఇదే పద్ధతిని అనుసరించారని అంటున్నారు. జిల్లాలో ఆ విధానం పాటించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఒకేరోజు రెండు సమావేశాలు వద్దు



డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఒకే రోజు స్కూల్, కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించడం సరికాదని పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఏపీటీఎఫ్, ఎస్టీయూ నాయకులు వేర్వేరుగా విద్యాశాఖ అధికారుల తీరును ఖండించారు. విద్యాశాఖ విడుదల చేసిన పాఠశాల కాంప్లెక్స్ సమావేశాల సమయాలను మార్చాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఆ సంఘం నాయకులు డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్ మాట్లాడుతూ.. స్కూళ్లలో తరగతులు బోధించి, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించి 20 కిలోమీటర్ల నుంచి 25 కిలోమీటర్ల దూరంలోని కాంప్లెక్స్ మీటింగ్స్‌కు హాజరుకావడం అసాధ్యమని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నరసింహులు, వెంకటమంరణ, సర్దార్‌వలి, చిదంబరరెడ్డి, బాలరామ్మోహన్, సూర్యనారాయణ, ఈశ్వరయ్య, తిప్పేస్వామి,మహేష్ పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే నిర్వహించాలి: ఎస్టీయూ

కాంప్లెక్స్ సమావేశాలను పాత పద్ధతిలోనే నిర్వహించాలని ఎస్టీయూ నేతలు డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు బుధవారం ఎస్టీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడుతూ.. స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహణ సమయాలు మార్పు చేస్తూ విద్యాశాఖ నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. మధ్యాహ్నాం స్కూల్ బంద్ చేసిన తర్వాత స్కూళ్ల నుంచి పిల్లలు ఇళ్లకు, టీచర్లు కాంప్లెక్స్ మీటింగ్స్ వెళ్లడం ఇబ్బందికరం అన్నారు. మహిళా టీచర్లు 12 కిలోమీటర్ల నుంచి 20 కిలోమీటర్ల దూరం కాంప్లెక్స్ సమావేశాలకు ఎలా వెళ్తారంటూ ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రామాంజనేయులు, నాయకులు సూర్యుడు, చంద్రశేఖర్, శివయ్య ఆచారి, నాగభూషణ, వాణి, కిషోర్, సురేష్‌బాబు, కృష్ణమోహన్, ఫణిభూషణ్ పాల్గొన్నారు.

చీనీ సీజన్ ప్రారంభం

● మార్కెట్‌కు పెరుగుతున్న దిగుబడులు



మార్కెట్‌కు వచ్చిన చీనీ కాయలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఆలస్యంగా చీనీ సీజన్ ప్రారంభమైంది. అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని చీనీ మార్కెట్‌కు చీనీ దిగుబడులు కాస్త పెరిగాయి. గత నాలుగైదు రోజుల నుంచి 40 టన్నులకు పైగా కాయలు మార్కెట్‌కు వస్తున్నాయి. మార్కెట్‌కు బుధ వారం 45టన్నుల చీనీ కాయలు వచ్చాయి. టన్ను గరిష్ఠ ధర రూ.21,850, కనిష్ఠ ధర రూ.5వేలు, సరాసరి రూ.11వేలతో అమ్ముడు పోయాయి. చీనీ సీజన్ ప్రారంభం కావడంతో మార్కెట్‌లోని వ్యాపారులు మండీలను ఒక్కొక్కటిగా ప్రారంభిస్తున్నారు. గత వారం రోజుల నుంచి ఈ ప్రక్రియ సాగుతోంది. కాగా ఇప్పటికీ మహారాష్ట్ర, తెలంగాణ తదితర ప్రాంతాల్లో స్థానికంగా చీనీ ఉత్పత్తులు మార్కెట్‌కు వస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కాయలను మార్కెట్‌కు తెచ్చేందుకు ఉమ్మడి జిల్లా రైతులు వేచిచూసే ధోరణిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో మార్కెట్‌కు చీనీ కాయల రాక మరికొంత ఆలస్యం అయ్యే అవకాశం ఉందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు చెప్పుకొచ్చారు.

మంటల్లో చిక్కుకుని వృద్ధుడి మృతి

లేపాక్షి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు అంటించిన మంటల్లో చిక్కుకుని వృద్ధుడు మృతిచెందిన సంఘటన లేపాక్షిలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. లేపాక్షి ప్రధాన ఆలయం వెనుక పిచ్చిమొక్కలు, గడ్డి ఏపుగా పెరిగింది. కొంతమంది ఆకతాయిలు బుధవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో పిచ్చిమొక్కలకు అగ్గిపెట్టారు. లేపాక్షి గ్రామానికి చెందిన మాబుసాబ్(87) పొలంవద్ద నుంచి అటుగా వస్తున్నాడు. అతడికి కళ్లు సరిగా కనబడకపోవడంతో మంటల్లో చిక్కుకున్నాడు. అక్కడే పిచ్చిమొక్కలు, గడ్డివాములు ఉండటంతో మంటలు అధికమై అందులో ఇరుక్కుని పూర్తిగా కాలిపోయాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

● వ్యవసాయ అధికారుల సమావేశంలో కలెక్టర్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వ్యవసాయ అధికారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం డైరీ, క్యాలెండర్లను జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మరింత మెరుగైన సేవలు అందించేలా చొరవ చూపాలని సూచించారు. వ్యవసాయ అధికారులకు ఏ సమస్య వచ్చినా నేరుగా తనను సంప్రదిస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వాసు ప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వెంకటరాముడు, ప్రధాన కార్యదర్శి వెంకట్‌కుమార్, కోశాధికారి శ్యామ్‌సుందర్‌రెడ్డి, చిన్నమ్మ, సోమశేఖర్, పెన్నయ్య, ఎల్లప్ప, కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి



షక్రుసాహెబ్ (ఫైల్)

గుత్తి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటవీధిలో నివాసముంటున్న శతాధిక వృద్ధుడు షక్రుసాహెబ్(103) మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. షక్రుసాహెబ్ వ్యవసాయం సాగుచేస్తుండేవాడు. ఆయనకు కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

డీ.హీరేహాళ్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వసగుడ్డం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వినోద్(30) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు బళ్లారి జిల్లా బండట్టి గ్రామానికి చెందిన వినోద్, ఉమేష్ అనే ఇద్దరు యువకులు రాయదుర్గం వైపు నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. రాత్రి 7 గంటల సమయంలో వసగుడ్డం గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో టైర్ పంచర్ కావడంతో అది అదుపు తప్పి యువకులు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో వారిద్దరూ కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో వినోద్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఉమేష్ స్వల్పంగా గాయపడ్డాడు. ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని, క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

ఎక్కువ కేసులు పరిష్కారమవ్వాలి

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ సూచించారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో బీఎస్ఎన్ఎల్, ఏపీఎస్ఆర్టీసీ, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, మున్సిపల్, పంచాయతీ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ.. మార్చి 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవండి

● ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ పిలుపునిచ్చారు. ఆర్టీసీ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని బుధవారం రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం రీజియన్‌లోని వివిధ డిపోల నుంచి 63 మంది సిబ్బంది హాజరై రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలందరికీ ఆర్ఎం ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఆర్ఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరు నెలలకోసారి రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ మెడికల్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్, రెడ్‌క్రాస్ వైద్యులు లక్ష్మణ్ ప్రసాద్, శంకర్‌గౌడ్, అనంతపురం డీఎం నాగభూపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ఆర్టీసీ చెలగాటం..!

● ప్రారంభమైన ఇంటర్ ప్రాక్టికల్స్

● మధ్యలో ఆగిపోతున్న డొక్కు బస్సులు

● ఆందోళన చెందుతున్న విద్యార్థులు



హావళిగిలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

విడపనకల్లు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆలస్యానికి మారుపేరుగా మారిన ఆర్టీసీ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోంది. ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ప్రారంభమయ్యాయి. డొక్కు బస్సులు ఎప్పుడు, ఎక్కడ ఆగిపోతాయో తెలియక విద్యార్థులు నిత్యం భయాందోళనలతో ప్రయాణం చేస్తున్నారు. బుధవారం విద్యార్థులు ప్రయాణిస్తున్న బడి బస్సు మధ్యలో ఆగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సు గేర్ రాడ్డు విరిగి పోవటంతో హావళిగి గ్రామంలోని బస్టాండ్‌లో నిలిచిపోయింది. ఉదయాన్నే ఇంటర్ విద్యార్థులకు ఉరవకొండలో ప్రాక్టికల్స్ ఉండటంతో ప్రత్యామ్నాయ బస్సు కోసం ఎదురు చూస్తూ ఆందోళన చెందారు. ఉదయం 8 గంటలకు బస్సు నిలిచి పోవటంతో ఉరవకొండకు చెందిన ఆర్టీసీ డ్రైవర్, డిపోకు ఫోన్ ద్వారా సమాచారం అందించి మరో బస్సును రప్పించారు. దీంతో విద్యార్థులు అర గంట ఆలస్యంగా ప్రాక్టిల్ పరీక్షలకు హాజరయ్యారు.

కండిషన్ బస్సులు నడపాలి: ప్రస్తుతం ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలంటే కండిషన్ ఉన్న బస్సులను నడపాలని ఆయా గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. సమయానికి బస్సులు రాక పోయినా, కండిషన్ లేని బస్సులు మధ్యలో నిలిచిపోయినా విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, రాజకీయ నాయకులు పరీక్షా సమయంలో విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపించి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

● ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

ధర్మవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. బుధవారం సాయంత్రం శమీనారాయణస్వామి ఆలయంలో చేనేతల సర్వసభ్యసమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కందికుంట హాజరై మాట్లాడారు. చేనేతలందరూ ఐక్యంగా సమస్యలపై పోరాటాలుచేసి పరిష్కరించుకోవాలన్నారు. ప్రధాన సమస్యలను గుర్తించి వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లితే పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి అందరూ కృషి చేయాలన్నారు. పట్టుచీరల తయారీ సంఘం నాయకులు గిర్రాజు రవి, జయశ్రీ, గడ్డం శ్రీనివాసులు, పోలా ప్రభాకర్, నీలూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఆర్జేడీ శామ్యూల్

కదిరి, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ ఆరేతజ్జడీ శామ్యూల్ బుధవారం పట్టణంలోని బాలికల ఉన్నతపాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో జ్యోతి అనే ఉపాధ్యాయురాలు సెలవు పెట్టకుండా గైర్హాజరుకావడంతో ఆమెకు మెమో ఇవ్వాలని డీఈఓ క్రిష్టప్పను ఫోన్‌ద్వారా ఆదేశించారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న కెమిస్ట్రీ ల్యాబ్‌ను పరిశీలించారు. ఆయనతోపాటు ఎంఈఓ చెన్నక్రిష్ణ, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు మునికుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయం...

నల్లమాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుమాల సచివాలయాన్ని ఎంపీడీఓ ఆజాద్ బుధవారం తనిఖీ చేశారు. సచివాలయంలో పలు రికార్డులతోపాటు అధికారుల హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. ముగ్గురు సిబ్బంది లేకపోవడంతో ఎక్కడికెళ్లారని, సిబ్బందిని ప్రశ్నించారు. వెంటనే వారికి ఫోన్‌చేసి మీరెక్కడికెళ్లారు, ఏపని మీద వెళ్లారని ప్రశ్నించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సచివాలయాల్లో పనిచేయాలన్నారు. ప్రజలకు అందబాటులోఉండి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఆయనతోపాటు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మట్టిని తోడేస్తున్న వైసీపీ నాయకులు



డీటీకి వినతి పత్రం ఇస్తున్న మైలసముద్రం ప్రజలు

కొత్తచెరువు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలసముద్రం గ్రామ సమీపంలో కాకుల గుట్ట వద్ద కొంతమంది వైసీపీ నాయకులు విచ్చలవిడిగా ఎక్స్‌కవేటర్ల సాయంతో మట్టిని తోడేస్తున్నారని గ్రామస్థులు డిప్యూటీ తహసీల్దార్ బాలాంజనేయులుకు బుధవారం ఫిర్యాదు చేశారు. గ్రామస్థులు మాట్లాడుతూ అక్రమంగా మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు స్పందించి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పశువైద్య శిబిరం



పాడి రైతులకు మందులు పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి

కదిరి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూతన కాలువ గ్రామంలో దొడ్ల డెయిరీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించినట్లు యూనిట్ ఇన్‌చార్జి కె. రవీంద్రనాథ్‌ఠాగూర్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల సేకరణ రాష్ట్ర ఇన్‌చార్జి యుగంధర్‌రెడ్డి, తలుపుల పశువైద్యాధికారి ప్రసన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రైతులు సూచనలు, సలహాలు ఇచ్చారు. పశువైద్య చికిత్సలు, వ్యాధి నిరోధిక టీకాలు, నట్టల నివారణ తదితరవాటిపై వివరించారు. సూపర్‌వైజర్ ఎం.శ్రీనివాసులు, టెక్నీషియన్ ఉదయ్‌గంగాధర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించండి

ముదిగుబ్బ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):తాగునీటి సమస్యపై దృష్టి పెట్టాలని ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం అధికారులతో తాగునీటి సమస్యపై సమావేశం నిర్వహించారు. రానున్న వేసవికాలంలో తాగునీటి సమస్యను ముందే అరికట్టాలని, విద్యుత్, మోటారు సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో దివాకర్, మంజుల, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది రక్తదానం

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రజారవాణాధికారి (డీపీటీఓ) కార్యాలయంలో ఆర్టీసీ సిబ్బంది బుధవారం రక్తదానం చేశారు. జిల్లా వ్యాప్తంగా 75మంది ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేసినట్లు డీపీటీఓ మధుసూదన్ తెలిపారు. పుట్టపర్తిలో కూడా పలువురు ఉద్యోగులు రక్తదానం చేశారు. ఇండియాన్ రెడ్‌క్రాస్ సెకటరీ విశ్వనాథ్, సభ్యులు రాజు, పుట్టపర్తి డిపో మేనేజర్ ఇనయతుల్లా, హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



రక్తదాతకు ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

ఎప్పుడు కూలునో..!

సిబ్బందికి పెచ్చుల భయం

● శిథిలావస్థలో ఓడీసీ పీహెచ్‌సీ
● కలగానే నూతన భవన నిర్మాణం
● సమస్యల తిష్ట

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ వైద్యశాలను 1986లో నిర్మించారు. ఈ పీహెచ్‌సీ పరిధిలో 14 పంచాయతీలు ఉన్నాయి. రోజూ వంద మందికి పైగా రోగులు ఈ వైద్యశాలకు వస్తుంటారు. ప్రస్తుతం వైద్యశాలలో ఏ గదిని చూసినా నెర్రెలు చీలి.. పెచ్చులు ఊడి.. కడ్డీలు కనిపిస్తున్నాయి. అది ఎప్పుడు కూలుతుందోనని వైద్యులు, సిబ్బంది, రోగులు భయం గుప్పెట్లో ఉంటున్నారు. గోడలు నెర్రెలు చీలి ఉండటంతో పాటు పెచ్చులు ఊడిపడుతున్నాయి. గతంలో వైద్య పరీక్ష నిమిత్తం రోగులు వేచి ఉన్న సమయంలో పైపెచ్చులు ఊడి పడడంతో రోగులు, సిబ్బంది ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని.. బయటకు పరుగులు తీశారు.

టెండర్లు పిలిచినా... : నూతన వైద్యశాల భవన నిర్మాణం గత వైసీపీ ప్రభుత్వం రూ.2.14 కోట్లు నిధులు కేయించింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఐదారుసార్లు టెండర్లు పిలిచినా.. బిల్లులు సరిగా రావని ఓ ఒక్క కాంట్రాక్టరూ ముందుకురాలేదు. దీంతో ఆ నిధులు వెనక్కు వెళ్లాయి.



గదిలో ఊడిన పెచ్చులు



ఓడీసీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సమస్యలు తిష్ట : ఈ వైద్యశాలలో అనేక సమస్యలు తిష్టవేశాయి. ప్రధానంగా కొన్నెళ్ల క్రితం బోరు చెడిపోయింది. దీంతో పంచాయతీ నీటి మీదే ఆధారపడాల్సి ఉంది. పొరపాటున పంచాయతీ మోటార్లు మరమ్మతులకు గురైతే వైద్యశాలలో నీటి కొరత తప్పదు. దీనికితోడు వైద్యశాల సమీపంలోనే చెరువు ఉండడంతో దోమలు అధికంగా ఉన్నాయి. వైద్యశాల కిటికీలకు మెష్‌లు లేకపోవడంతో వైద్య సిబ్బంది, రోగులు దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. వైద్యశాలలో పరికరాలు ఉపయోగించకపోవడంతో అవి తుప్పుపట్టి మూలపడ్డాయి. ప్రధానంగా ట్రైసైకిళ, స్ట్రెక్చర్ తుప్పుపట్టాయి. రోగుల మంచాల పరిస్థితి కూడా అంతే.

ఉన్నతాధికారులకు తెలిపాం



గతంలో పలుమార్లు వైద్యశాల స్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గతంలో నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు కావడంతో టెండర్లు పిలిచినా.. ఏ కాంట్రాక్టరూ ముందుకురాలేదు. తిరిగి భవన నిర్మాణం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- భానుప్రకాష్‌నాయక్, పీహెచ్‌సీ వైద్యుడు, ఓడీసీ

శ్మశాన స్థలాన్ని కాపాడండి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎస్సీ కాలనీవాసులు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకుతోటపల్లి ఎస్సీ కాలనీవాసులకు కేటాయించిన శ్మశాన స్థలాన్ని కాపాడాలని బుధవారం తహసీల్దార్ అనంతాచారికి వినతిపత్రం అందించారు. బలరాం, పెద్ద ఓబన్న, రంగప్ప, క్రిష్టప్ప, నరసింహలు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబర్ 594లో ఎకరా 11 సెంట్ల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఇందులోనే రస్తాకూడా ఉందన్నారు దీనిని శ్మశానానికి వినియోగిస్తున్నామని, ప్రస్తుతం భూమిలో ఉన్న సమాధులు తొలగించి సాగుచేసుకోవడానికి కొంతమంది ప్రయత్రిస్తున్నారని ఆరోపించారు. శ్మశాన స్థలాన్ని కాపాడి, తమకు న్యాయం చేయాలని ఎస్సీకాలనీవాసులు కోరారు.

ట్రాఫిక్‌పై అవగాహన ర్యాలీ



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మిట్స్ కళాశాల విద్యార్థులు

కదిరి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ట్రాఫిక్ సమస్యపై బుధవారం మదనపల్లి మిట్స్ కళాశాల విద్యార్థులతో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, హెల్మెట్ ధరించాలని సూచించారు. సిగ్నల్ జంప్ చేయకూడదని సూచించారు. పట్టణ సీఐ నారాయణరెడ్డితోపాటు ఎస్ఐ బాబ్‌జాన్, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కదిరి, నల్లచెరువు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ వీవీఎస్ శర్మ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 8 పోస్టులకు 31 మంది దరఖాస్తు చేసుకోగా, 30మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్, సీడీపీఓలు రాధిక, జయంతి పాల్గొన్నారు.

నిరుపయోగంగా గిడ్డంగి



పోరెడ్డిపల్లి వద్దనున్న గిడ్డంగి

గాండ్లపెంట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోరెడ్డివారిపల్లి వద్ద రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన గిడ్డంగి నిరుపయోగంగా మారింది. నాబార్డు నిధులతో గాండ్లపెంట ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో రూ.40లక్షలతో రెండేళ్ల క్రితం గిడ్డంగి నిర్మించారు. గిడ్డంగికి సరైన రహదారి సౌకర్యం లేదు. అది కూడా ఊరి బయట ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. రోజూ మద్యం ప్రియులు మందు తాగుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గిడ్డంగిని వినియోగంలోకి తీసుకునిరావాలని, పండించిన పంటలు నిలువచేయడానికి అవకాశముంటుందని రైతులు చెబుతున్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



మంత్ర పుష్పం, ద్వాదశ నైవేద్యం సమర్పిస్తున్న అర్చకులు

ధర్మవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేటలో లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఐదు రోజులుగా జరుగుతున్న అష్టాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ఇందులో భాగంగా బుధవారం సుప్రభాత సేవ, పుష్పయాగం, మంత్రపుష్పం, ద్వాదశ నైవేద్యం, మహదాశీర్వవచన కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. కార్యక్రమంలో గణపతి సచ్చిదానంద దత్త జ్ఞానబోధ సభ ట్రస్టు కమిటీ సభ్యులు మెటికల కుళ్లాయప్ప, దత్తశివ, నాగప్ప, శాగా సురేశ్, శంకర సంజీవులు, రంగా, శీన, రామాంజనేయులు పాల్గొన్నారు.

అన్న క్యాంటిన్ పరిశీలన



అన్నక్యాంటీన్‌లో భోజనం చేస్తున్న టీడీపీ నాయకులు

పుట్టపర్తి టౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అన్న క్యాంటీన్‌ను బుధవారం పుట్టపర్తి టీడీపీ పట్టణ అధ్యక్షుడు బోయ రామాంజనేయులు ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. సీనియర్ నాయకుడు తిరుపాల్ అన్న క్యాంటీన్‌లో సొంత ఖర్చులతో నాలుగువందల మందికి భోజన ఏర్పాట్లు చేశారు. పేదలకు నాయకులు అన్నం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్ పాల్గొన్నారు.

పోలీసులకు వీఆర్ఏ ఫిర్యాదు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తనపై తిప్పేపల్లికి చెందిన చంద్రశేఖర్, సూర్యనారాయణ చేయి చేసుకున్నారంటూ బుధవారం ఎస్ఐ మల్లికార్జునరెడ్డికి వీఆర్ఏ తలారి చిన్నకొండప్ప ఫిర్యాదు చేశారు. నోటీసు ఇచ్చేందుకు వెళ్లగా వీరు తనను కొట్టారని, వారిపై కేసు నమోదు చేయాలని ఎస్ఐని కోరారు.

చీటింగ్ కేసు నమోదు

కదిరి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని నాగిరెడ్డిపల్లిలో రాజకీయంగా, పెద్దమనిషిగా వ్యవహరించే పి.రమణారెడ్డిపై బుధవారం చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. నాగిరెడ్డిపల్లిలో ఉంటూ, కూలి పనులుచేసుకునే అక్కులమ్మ అనే మహిళ రమణారెడ్డికి సంవత్సరం క్రితం రూ.50వేలు దాచమని ఇచ్చింది. తాను అడిగినప్పుడు తిరిగి ఇవ్వాలని కోరింది. ఆమె ప్రస్తుతం ఆ డబ్బు తిరిగి ఇవ్వాలని రమణారెడ్డిని కోరగా, తనకు డబ్బులివ్వలేదని సమాధానం చెప్పడంతో, మోసం చేసినట్లు బాధిత మహిళల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు

మహిళ ఆత్మహత్యాయత్నం

ధర్మవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మారుతినగర్‌కు చెందిన తులసి అనే మహిళ కుటుంబ కలహాలతో ఇంటిలో అధికమోతాదులో మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను గమనించిన కుటుంబసభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సఅనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

శేషయ్యగారిపల్లిలో చిరుత సంచారం



కొండ ప్రాంతంలో ఉన్న చిరుత అడుగులు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శేషయ్యగారిపల్లి పంచాయతీ శేయ్యగారిపల్లి తండాలో బుధవారం చిరుత సంచరించినట్లు గొర్రెలకాపర్లు చెబుతున్నారు. గొర్రెల యజమాని రమావత్ ఆనంద్‌నాయక్ తెలిపిన మేరకు తన గొర్రెలతోపాటు పాలి గొర్రెలు 60 దాకా సంరక్షిస్తున్నానన్నారు. ప్రతిరోజులాగానే మంగళవారం గ్రామ సమీపంలో ఉన్న అక్కదేవత కొండ ప్రాంతానికి గొర్రెలను మేతకు తోలుకెళ్లానన్నారు. ఏడేళ్ల క్రితం దేవరకు వదిలిన మేకపోతును కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. సాయంత్రం ఇంటికొచ్చే సమయంలో దేవర మేకపోతు కనిపించకపోవడంతో బుధవారం ఉదయం అక్కమ్మగారి కొండ చుట్టూ గాలించగా, మేకపోతును చంపి తిని వేయగా మిగిలిన భాగాన్ని గమనించానన్నారు. పక్కనే ఉన్న అడుగులను గమనించిన కొంతమంది ఇది చిరుత పాదాల గుర్తులని చెప్పడంతో చిరుతే వచ్చి మేకపోతును చంపివేసిందన్నారు. విషయం కాస్త చుట్టుపక్కల గ్రామాలకు పాకడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఆ పాదాలు చిరుతవా లేదా అన్న వాటిని అటవీశాఖాధికారులు నిగ్గు తెల్చాల్సి ఉంది.

అంగన్‌వాడీల్లో అమ్మ భాష

ధర్మవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మాతృభాష నేర్పించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ దిశగా పూర్వ ప్రాథమిక విద్యలో ఆరేళ్ల లోపు చిన్నారులకు తెలుగుభాష నేర్పించడం ద్వారా మానసిక వికాసం వృద్ధి చెందుతుందనే ఆలోచనతో నూతన పాఠ్యపుస్తకాలు అందజేశారు. సత్యసాయి జిల్లాలో 12 అంగన్‌వాడీ ప్రాజెక్టు ఉన్నాయి. ఇందులో 2824 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 0-3, 3-6 లోపు చిన్నారులు 1లక్ష 10వేల మంది ఉన్నారు. గర్భిణీలు 12931 మంది, బాలింతలు9394 మంది ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన పాఠ్యపుస్తకాలు, మందులకిట్లు సరఫరాచేశారు.చిన్నారులకు పీపీ1, పీపీ2 పేరుతో పూర్వ ప్రాథమిక విద్య అందించేందుకు ఆకర్షిణీయ బొమ్మలతో అక్షరమాలను తెలిపే పుస్తకాలను కేంద్రాలకు సమకూర్చారు. ఈ ఏడాది తెలుగుతోపాటు ఆంగ్లమాధ్యమ పుస్తకాలిచ్చారు. చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీసి మరింత ప్రోత్సహించనున్నారు.



అక్షర మాలతో పాఠ్యపుస్తకం

ప్రథమ చికిత్సకు మందులు: సమగ్రశిక్ష అభివృద్ధి పథకంలో భాగంగా ఔషధాలతో కూడిన కిట్లను అంగన్‌వాడీ కేంద్రాలకు అందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు వీటి వినియోగంపై అవగాహన కల్పించారు.

పొలుసు పురుగు నివారణపై అవగాహన



చీనీ చెట్లను పరిశీలిస్తున్న హెచ్ఓ చంద్రశేఖర్

ధర్మవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పొలుసు పురుగు నివారణపై చీనీ రైతులకు జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. చీనీని పీడిస్తున్న పొలుసు అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. ఇందుకు స్పందించి ఉద్యానశాఖ అధికారి తాడిమర్రి మండలంలోని కునుకుంట్ల గ్రామంలో చీనీ పంటను పరిశీలించారు. పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రైతులతో మాట్లాడుతూ ముఖ్యంగా చీనీ చెట్లకు పొలుసు పురుగు, వేరుకుళ్లు తెగుళ్ల సోకడంతో చెట్లు చనిపోతున్నాయని తెలిపారు. తోటలకు తప్పనిసరిగా మైలుతుత్తి మట్టి సున్నం కలిపిన మిశ్రమాన్ని ఏడాదిలో కనీసం రెండుసార్లు పూయాలన్నారు. బంకతెగుళ్లు, పొలుసు పురుగులను నివారించవచ్చన్నారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రామసుబ్బయ్య మాట్లాడుతూ రైతులు ఏడాదికి రెండు మూడు సార్లు చీనీ చెట్లకు పశువుల ఎరువు, వేపపిండి ట్రైకోడెర్మా విరిడల మిశ్రమాన్ని 10కిలోల చొప్పున వేసుకోవడం ద్వారా వేరుకుళ్లు నివారించవచ్చన్నారు. తోటలో కలుపు మందులు వాడటం వల్ల చీనీ చెట్ల వేర్లు దెబ్బతిని చనిపోతున్నాయన్నారు. రైతులు కలుపు నివారణకు మందులుకొట్టకుండా పచ్చిరొట్ట ఎరువులు వేయాలన్నారు. స్థానిక ఉద్యాన అధికారి అమరేశ్వరి, వ్యవసాయ అధికారి రమాదేవి, రైతుసేవా కేంద్రం అధికారులు గౌతమి, జయచంద్ర పాల్గొన్నారు.

ప్రతి రైతు యూనిక్ ఐడీని పొందాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

బత్తలపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేసి యూనిక్ ఐడీ నంబర్‌ను పొందాలని వ్యవసాయ శాఖ శాస్త్రవేత్త భాస్కర్‌రెడ్డి సూచించారు. మండలంలోని పొట్లమర్రి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్త వ్యవసాయ పొలాలను పరిశీలించి రైతులకు సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతులకు యూనీక్ ఐడీతో 14 అంకెల గుర్తింపు కార్డు వస్తుందన్నారు. భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా నమోదు నమోదు చేసుకోవాలన్నారు. దీని ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలు రైతులకు అందించే పథకాలు, రాయితీలు, బీమా వర్తిస్తాయన్నారు. రైతు సేవా కేంద్రలను రైతులు సంప్రదించాలన్నారు. వ్యసాయ అధికారులు నరసింహుడు, రమేష్ నాయక్, ఓబిరెడ్డి పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతవుతున్న పచ్చని చెట్లు



కాలిపోయిన పచ్చని చెట్లు

గాండ్లపెంట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు ఎండు గడ్డికి నిప్పు పెట్టడంతో పచ్చని చెట్లు అగ్నికి ఆహుతవుతున్నాయి. ఖరీఫ్‌లో వర్షాలు కురవడంతో బీడు భూములు, వంకలు, వాగులు, గుట్టలు, కొండలు, తదితర ప్రాంతాల్లో పచ్చగట్టి ఏపుగా పెరిగింది. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉండడంతో పచ్చగడ్డి కాస్త ఎండిపోయింది. ఆకతాయిలు ఏదో ఒక చోట నిప్పు పెడితో పలుచోట్లకు నిప్పు వ్యాపించి బీడుభూములతోపాటు సాగుచేసిన పంటలకు మంటలు సోకుతున్నాయి. దీనికితోడు మండలం చుట్టూ పలు కొండల్లో కూడా అగ్గి వ్యాపిస్తుండటంతో కొండల్లో మంటలు చెలరేగి బూడిదవుతున్నాయి. పలుచోట్లు కంది, మామిడిచెట్లకు నిప్పంటుకుని కొంతమేర దగ్ధమయ్యాయని రైతులు వాపోతున్నారు. అటవీ అధికారులు స్పందించి ఆకతాయిల నుంచి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

ధర్మవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. స్థానిక కదిరిగేటు వద్ద విద్యుత్ స్తంభాలు ఎత్తే క్రేన్ ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. శాంతినగర్‌కు చెందిన దాసరి సుబ్బయ్య కోడిగుడ్ల బండి తోపుకుంటూ వస్తున్న సమయంలో కదిరి గేటు వద్ద వెనుక వైపు నుంచి క్రేన్ వచ్చి అతినిని ఢీకొంది. దీంతో సుబ్బయ్య కాలు నుజ్జునుజ్జుఅయింది. స్థానికులు వెంటనే అతన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు ప్రభుత్వాస్పత్రికి వచ్చి జరిగిన సంఘటనపై వివరాలు అడిగితెలుసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని చిన్నారికి...

పట్టణంలోని రాంనగర్‌లో చింతా బన్ని అనే చిన్నారి ఇంటి ముందు ఆడుకుంటుండగా బుధవారం గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో చిన్నారికి కాలు విరిగింది. గాయపడిన చిన్నారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. చిన్నారి మామ బండారు శివ ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చేనేత కార్మికుడికి...

రోడ్డు ప్రమాదంలో చేనేత కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. టూటౌన్‌పోలీసులు తెలిపిన మేరకు.. మండలంలోని తుంపర్తి కాలనీకి చెందిన వెంకటేశ్ రేగాటిపల్లి రైల్వేగేటు వైపు నుంచి షిర్డీసాయిబాబా గుడి వద్ద రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్టాండ్ వైపు వెళ్లే ద్విచక్రవాహనంలో వెళ్తున్న వెంకటేశ్‌ను ఢీకొట్టాడు. దీంతో వెంకటేశ్ కుడి కాలువ తీవ్రమైన గాయపడ్డాడు. స్థానికులు గమనించి వెంకటేశ్‌ను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చికిత్స పొందుతూ పసికందు మృతి

బత్తలపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మారుతి నగర్ ముళ్లపొదల్లో మంగళవారం లభించిన పసికందు ఆర్డీటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. బుధవారం ఎస్ఐ సిబ్బందితో మారుతినగర్‌లోకి వెళ్లి అక్కడ ప్రజలను పసికందును వదిలివెళ్లిన ఘటనపై ఆరా తీశారు. పసికందు మృతదేహన్ని రెవెన్యూ, పోలీసులు ఐసీడీఎస్ అధికారుల సమక్షంలో ఖననం చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సున్నపుగుట్టతండా ప్రాంతంలో పేకాట స్థావరంపై బుధవారం దాడులుచేసినట్లు అప్‌గ్రేడ్ సీఐ నీరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ తమ సిబ్బందితో పేకాటస్థావరంపై దాడులుచేసి, ఏడుగురిని అరెస్టు చేసి రూ.4,020 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

పట్టుచీరల చోరీ

ధర్మవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతినగర్‌లో 21 పట్టుచీరలు చోరీ చేశారు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు శాంతినగర్‌కు చెందిన దాసరి లక్ష్మీనారాయణ గత నెల 25వ తేదీన ఆటోలో 21 పట్టు చీరలు పెట్టుకుని నిద్రపోయాడు. ఈక్రమంలో గుర్తు తెలియని దొంగలు వాటిని అపహరించుకుని వెళ్లారు. వీటి విలువ రూ.1.05లక్షలు ఉంటుందన్నారు. దీనిపై బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

న్యూస్ బాక్స్

విద్యుత్ సక్రమంగా ఇవ్వాలని రైతుల ధర్నా



అగళి సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

అగళి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంఎం పాళ్యం గ్రామానికి చెందిన బోరుబావులకు విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలని రైతులు ధర్నా చేశారు. రోజుకు గంట మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. గత నాలుగు రోజులుగా బోరుబావులకు విద్యుత్ సరఫరా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులను విచారిస్తే లోవోల్టేజి సమస్య ఉందని, అందుచేత విద్యుత్ సరఫరా చేయడం లేదని చెబుతున్నారన్నారు. విద్యుత్ సరఫరా చేయకుంటే పంటలు ఎండిపోతాయన్న విషయం అధికారులకు తెలియక పోవడం బాధాకరమన్నారు. ధర్నాలో శివన్న, శాంతరాజు, మంజునాథ్, శివకుమార్, రంగప్ప, గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.

మైలార లింగేశ్వర స్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో మైలార లింగేశ్వరస్వామి

అగళి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో వెలసిన మైలార లింగేశ్వరస్వామికి ధోని పూజా కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఘనంగా నైవేద్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గొరవయ్యలు నృత్యం చేస్తూ భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నారు.

పావగడ ఆస్పత్రికి వైద్యులను నియమించండి

పావగడ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పావగడ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరత అధికంగా ఉందని వెంటనే వైద్యులను నియమించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేష్ గుండురావును పావగడ ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్ కోరారు. బెంగళూరులోని మంత్రి ఛాంబర్‌లో మంగళవారం పావగడ ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలపై మంత్రితో చర్చించారు. 14మంది వైద్యులు పనిచేయాల్సి ఉండగా కేవలం నలుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారన్నారు. రోజు 600మంది దాకా ఓపీ పేషెంట్లు వచ్చి వెళ్తుంటారని మంత్రి దృష్టికి తీసుకెళ్లానన్నారు. వీలైనంత త్వరగా వైద్యులను నియమించి రోగులకు సేవలందించేలా చూడాలని కోరానన్నారు. మంత్రికూడా సానుకూలంగా స్పందించి త్వరలోనే నియామకాలు చేపడతామని హామీ ఇచ్చారన్నారు.

పింఛన్ల పరిశీలన



పింఛన్లను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

పరిగి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):మండలంలో రూ.15వేలు పింఛన్ తీసుకుంటున్న వారిని డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు వైద్యులు బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లావైద్యాధికారులు స్వాంతన, ఇందురేఖలు బుధవారం కొండంపల్లి, నర్సాపురం, వన్నంపల్లి, పైడేటి, యర్రగుంట, మోదా, శ్రీరంగరాజులపల్లి, బీచిగానిపల్లి పంచాయతీల్లో పర్యటించి పింఛన్‌దారుల సదరన్ సర్టిఫికెట్లను తనిఖీచేశారు. వైద్యపరీక్షలు నిర్వహించి వైద్యపరంగా సమస్యలు ఉన్నాయా? లేక అక్రమంగా పింఛన్లు తీసుకుంటున్నారా?అని పరిశీలించారు. కార్యక్రమంలో డా.నవీన, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టండి

సోమందేపల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాగేచెరువు గ్రామంలో సిస్టన్‌లు నిండి మంచినీరు రోడ్లపై వృధాగా పోతోందని దానిని అరికట్టాలని బుధవారం స్థానిక ప్రజలు కోరారు. వేసవి సమీపిస్తున్న సందర్భంగా ప్రతినీటి బొట్టును ఒడిసిపట్టి నీటిని ఆదాను చేయాల్సిన పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గ్రామానికి డైరెక్ట్ కనెక్షన్ ఇవ్వడం వల్ల ఇలా నీటి వృధా జరుగుతోందని వారు తెలిపారు. ప్రతిరోజూ ఇదే పరిస్థితి గ్రామంలో ఉందని పేర్కొన్నారు. దీనిపై సర్పంచ్ నరసింహులు మాట్లాడుతూ గ్రామానికి నాలుగు చోట్ల మంచినీటి పథకాలున్నాయన్నారు. వీటన్నింటికి ఒకే వాటర్‌మెన్ ఉండటంవల్ల నీటి వృధాను అరికట్టేందుకు వీలు పడటంలేదన్నారు. సత్వరం ఆదిశగా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

అగళి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీసీ, ఐబీసీ, కాపు, దరఖాస్తుదారులు సబ్సిడీ రుణాల కోసం ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ యాదవేంద్ర తెలిపారు. గడువును ఈనెల 15వరకు పొడిగించడం జరిగిందన్నారు. అర్హతగల వారందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మునిసిపల్ కార్మికుల సంఖ్యను పెంచండి

పెనుకొండ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరుతూ సీఐటీయు నాయకులు నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటేశ్, బాబావలి, రైతు సంఘం ఉపాధ్యక్షులు హరి మాట్లాడుతూ నగర పంచాయతీగా మారిన తరువాత కార్మికులు వారి పనిని సక్రమంగా నిర్వహిస్తున్నారన్నారు. అయినా పట్టణ విస్తరణ జనాభా పెరిగిందని దానికి అనుగుణంగా కార్మికుల సంఖ్య పెరగలేదన్నారు. పట్టణం శుభ్రంగా ఉండాలంటే కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉండాలన్నారు.

ఆలయానికి రథం వితరణ

పెనుకొండ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి భక్తులు రూ.5.5లక్షలు విలువచేసే నూతన రథాన్ని అందజేశారు. ఉదయం ఆలయంలో అర్చకులు చంద్రశేఖర్‌స్వామి పూజలు, అభిషేకాలు, రథప్రతిష్ఠ, హోమాలు నిర్వహించారు.

దేవదోత్తముని తిరుతేరు... తిరిగె చిక్కులనెల్ల

● వాడవాడలా ఘనంగా రథోత్సవాలు ● సోమందేపల్లి మాగేచెరువులో రథాన్ని లాగిన మంత్రి సవిత



కొల్లాపురమ్మ అమ్మవారి రథాన్ని లాగిన మంత్రి సవిత

సోమందేపల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి మండలంలోని మాగేచెరువు గ్రామంలో బుధవారం కొల్లాపురమ్మ అమ్మవారి రథోత్సవంలో బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పాల్గొన్నారు. మంత్రి సవిత మొదట ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గాజుల అంగళ్లో మట్టిగాజులను వేయించుకున్నారు. అనంతరం రథంవద్ద అమ్మవారిని పూజించి గ్రామస్థులతో కలిసి రథాన్ని లాగారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసింహులు, కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు పాల్గొన్నారు.



కన్నుల పండువగా ఆంజనేయస్వామి రథోత్సవం

మడకశిరటౌన్: పట్టణ సమీపంలోని మిట్టబండ ఆంజనేయస్వామి రథోత్సవ కార్యక్రమం బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారికి విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం రథోత్సవ హోమం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. 12గంటల సమయంలో స్వామి వారిని రథంపై ఉంచి ఊరేగించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, సర్పంచ్ గ్రామప్రముఖులు పాల్గొన్నారు.





పావగడ, అమరాపురంలలో వైభవంగా బ్రహ్మరథోత్సవం

పావగడ :పావగడ శనైశ్చరస్వామి ఆలయ ప్రాంగణంలో మాఘమాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం జేష్ఠాదేవి సమేత శనైశ్చరుడి బ్రహ్మరథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.

అమరాపురం : అమరాపురం మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవ రథాన్ని శ్రీరాముడి ఆలయం వరకు లాగినట్లు ఆలయ కమిటీ వారు రాజశేఖర్, రఘునాథగుప్తలు తెలిపారు.

రైతులకు తీరని చింత

● దిగుబడి, ధరలేక ఆందోళనలో అన్నదాతలు
● ఇతర మార్కెట్లను ఆశ్రయిస్తున్న వైనం
● కోల్డు స్టోరేజ్‌లో పది వేల మెట్రిక్ టన్నుల నిల్వ
● మద్దతు ధర కల్పించాలని డిమాండ్



చింతకాయల నుంచి పండును విడదీస్తున్న మహిళా కూలీలు

మడకశిర, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): చింతపండుకు ఈ యేడు దిగుబడి సరిగా లేక పోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని రైతన్నలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రధాన పంట అయిన వేరుశనగ ప్రతి యేడు ఎదో రకంగా దెబ్బతిని నష్టపోతుండడంతో ప్రత్యామ్నాయంగా వాణిజ్యపంట అయిన చింతను ఎంచుకున్నా ధరలు లేకపోవడంతో నష్టం వాటిల్లుతోందని అటు రైతులు ఇటు వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చింత ద్వారా వందలాది మంది కూలీలు ఉపాధి పొందుతున్నారు. గతయేడు దిగుబడితో పోల్చుకుంటే ఈ యేడు 20శాతానికి పడిపోయింది. ధరలు లేక పోవడంతో కోట్ల రూపాయల విలువ చేసే చింత పండు కోల్డు స్టోరేజీల్లో మగ్గుతోంది. దీనికి తోడు స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేక పోవడంతో సమీపంలోని హిందూపురం, కర్ణాటకలోని హిరియూరు, దావణగేరి వంటి మార్కెట్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. ధర లేకపోవడంతో చింతమానులలోని ఫలసాయాన్ని కొనుగోలు చేసేందుకు వ్యాపారస్తులు ఎవరూ ముందుకు రావడంలేదు. ప్రస్తుతం పువ్వుపండు మొదటిరకం 10కేజీలకు రూ.1000 నుంచి రూ1200, కర్పూడిరకం రూ.1200 నుంచి రూ.1800, రెండవరకం రూ.750 నుంచి రూ.900 వరకు పలుకుతోంది. ఈ ధరలు కూడా నిలకడగా ఉండటంలేదని రైతన్నలు అంటున్నారు

ప్రత్యామ్నాయంగా చింత పంట

కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మడకశిర నియోజకవర్గంలో ఎటువంటి ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఈ ప్రాంత రైతులు మెట్టభూములో వేరుశనగ పంటను సాగు చేస్తూ జీవనం సాగించేవారు. అతివృష్టి అనావృష్టి కారణంగా వేరుశనగ పంట దెబ్బతిని నష్టాలను చవిచూస్తున్న రైతన్నలు ప్రత్యామ్నాయంగా చింతచెట్ల పెంపకం చేట్టారు. గత రెండు సంవత్సరాలుగా దిగుబడులు, ధరలు ఆశించిన విధంగా లేకపోవడంతో ప్రారంభంలోనే నష్టాలను చవిచూస్తున్నామంటున్నారు

వేలాది మంది కూలీలకు ఉపాధి

కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మడకశిర నియోజకవర్గంలో ఎటువంటి ఉపాధి అవకాశాలు లేకపోవడంతో చింత ద్వారా వేలాదిమంది కూలీలకు ఉపాధి లభిస్తుంది. చింతకాయలు తొలిగించేందుకు, చింతకాయలను నుంచి పొట్టును, నారను, విత్తనాలు వేరుచేసేందుకు 4నుంచి 5 నెలలబాటు కూలీలకు పనులు దొరుకుతాయి. ఇంతమందికి ఉపాధి కల్పించే ఈ చింతపండు పరిశ్రమను ఉపాధిహామీ కింద చేరిస్తే కొంతవరకూ రైతుకు ఊరట చిక్కుతుంది. కూలీలకు కూడా పనులు దొరుకుతాయి. అదేవిధంగా ప్రభుత్వం కూడా చింతపండుకు మద్దతు ధరను ప్రకటించాదని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రారంభంలోనే ధరలు లేవు



చింతపండుకు ధరలు లేకపోవడంతో ఖర్చులు మీద పడుతున్నాయి. నాకు 40 చింతమానులు ఉన్నాయి. గతయేడు ధరలు లేక నష్టపోయాం. ఈ యేడు దిగుబడి ధరలు లేక నష్టపోతున్నాం. కింటాళ్ళు చింతపండు సిద్ధం చేయడానికి 6నుంచి రూ7వేల దాకా ఖర్చు అవుతుంది. చింతమానులలో కాయలను తొలిగించడానికి కూలీకి రోజుకు రూ.700లు, కాయలనుంచి నారను, విత్తనాలను వేరు చేసేందుకు రోజకు ఆడకూలీలకు రోజుకు రూ300లు ఇస్తున్నాం. చింతపండును మార్కెట్‌కు తరలించేందుకు బాడుగా 500నుంచి 600లు చెల్లించాల్సి ఉంది. ఇంత ఖర్చు పెట్టినా చివరకు చింతపండు కొనేవారు లేరు.
-తిప్పేస్వామి, మల్లినమడుగు

టెన్త్‌లో మడకశిరను మొదటి స్థానంలో నిలపాలి



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): టెన్త్ ఫలితాల్లో మడకశిరను జిల్లాలో మొదటి స్థానంలో నిలపాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అన్నారు. బుధవారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఐదు మండలాల పరిధిలోని విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి నారాలోకేష్, విద్యాశాఖ బాధ్యతలు చేపట్టాక విద్యా వ్యవస్థలో సమూలమార్పులు చేస్తున్నారని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యాశాఖను నిర్వీర్యం చేశారని, నాడు నేడు పథకం ద్వారా వైసీపీ నాయకుల జేబులు నింపుకొన్నారేతప్ప మౌలిక వసతులు కల్పించిందిలేదన్నారు. చివరకు ఉపాధ్యాయులను మద్యం షాపుల వద్ద కాపలాకు పెట్టిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, ఐదు మండలాల ఎంఈఓలు, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శి రాజప్పకు నోటీసు

గుడిబండ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోరుబాగల్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రాజప్పకు షోకాజ్‌నోటీసు అందించినట్లు ఈఓఆర్‌డీ నాగరాజునాయక్ బుధవారం తెలిపారు. పంచాయతీ కార్యదర్శి విధులకు సక్రమంగా హాజరుకాకపోవడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు సరైన అవగాహన కల్పించడంలేదన్నారు. దీంతోపాటు విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదని, ప్రజలకు అందుబాటులో ఉండటంలేదని, దీంతో పంచాయతీ కార్యదర్శికి షోకాజ్‌నోటీసు అందించినట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అజ్జయ్య స్వామికి పూజలు

గుడిబండ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళికెర, ఎస్.రాయాపురం గ్రామాల్లో వెలిసిన అజ్జయ్యస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమిసందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, నిర్వహించారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని జరిపించారు. ఈకార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకొన్నారు.

ఎనిమిది మందిపై కేసు

గోరంట్ల, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీకాలనీకి చెందిన గోవిందమ్మ ఇంటిపై దాడికి సంబంధించిన ఏడుగురు నిందితులపై బుధవారం కేసు నమోదుచేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. ఎస్సీకాలనీలో సురేష్, గోవిందమ్మ దంపతులు నివాసముంటున్నారు. అదే కాలనీకి చెందిన వారితో ఏర్పడిన మనస్పర్థల కారణంగా శేషు, వినోద్, నరసింహులు, సుధాకర్, ఆదిలక్ష్మీ, భూదేవమ్మ, మంగమ్మలు బుధవారం వారి ఇంటిపై దాడిచేశారని పోలీసులు తెలిపారు. గోవిందమ్మ ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బాకీ తీర్చమన్నందుకు దంపతులపై దాడి

గోరంట్ల, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొప్పనపల్లి తండాకు చెందిన మహేంద్రనాయక్, తనకు రావాల్సిన మొత్తాన్ని అడిగినందుకు అదే తండాకు చెందిన ముగ్గురు వ్యక్తులు భార్యభర్తలపై బుధవారం దాడికి పాల్పడినట్లు సీఐ శేఖర్ తెలిపారు. పొప్పనపల్లి తండాకు చెందిన మహేంద్రనాయక్ తన టాక్టర్‌ను విక్రయించడంతో, ఇందుకు సంబంధించి మోతీలాల్‌నాయక్, రవినాయక్, శ్రీనివాసులనాయక్‌లు ఆయనకు రూ.25వేలు బాకీ పడ్డారు. తనకు రావాల్సిన మొత్తం చెల్లించాలని మహేంద్రనాయక్ కోరగా, వారు ముగ్గురు కలిసి మహేంద్రనాయక్‌ను కొట్టడమేకాకుండా, అడ్డువచ్చిన ఆయన భార్యపైన కూడా దాడిచేశారు. మహేంద్రనాయక్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రథోత్సవంలో పాల్గొన్న ఉష



పూజా సామగ్రి తీసుకెళ్తున్న ఉష శ్రీచరణ్

సోమందేపల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాగేచెరువు గ్రామంలో బుధవారం జరిగిన కొల్లాపురి మహాలక్ష్మి అమ్మవారి రథోత్సవ కార్యక్రమంలో జిల్లా వైసీపీ అధ్యక్షురాలు ఉశ శ్రీచరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆమె అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

అభివృద్ధి అంటే ఇదీ..

● సెల్ఫీ ఛాలెంజ్ చేసిన మంత్రి సవిత



గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద సెల్ఫీ తీసుకుంటున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో తాగు, సాగునీటి కోసం ప్రజలు, రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అందరినీ దృష్టిలో పెట్టుకుని సకాలంలో నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా అభివృద్ధి అంటే ఇదని మంత్రి సవిత సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. గొల్లపల్లి రిజర్వాయర్‌వద్ద బుధవారం రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కాలువకు నీటిని విడుదల చేశారు. అనంతరం గంగపూజ చేశారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దాం: మంత్రి సవిత

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అందరం కలిసికట్టుగా పనిచేసి ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దామని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో మండల విద్యాశాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మంచినీరు, మరుగుదొడ్లు వంటిసౌకర్యాలు, విద్యార్థులు సౌకర్యంగా కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అంతేకాకుండా ప్రభుత్వ బడుల్లో మెరుగైన ఫలితాల కోసం ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. పాఠశాలలు మూతబడకుండా తల్లిదండ్రుల సమావేశాలు ఏర్పాటుచేయాలన్నారు.

సెంట్ ఫ్యాక్టరీని తనిఖీ చేసిన కర్ణాటక పోలీసులు

● అడ్డుకున్న దేవరపల్లి గ్రామస్థులు

అగళి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హుళ్లికెర దేవరపల్లి సమీపంలో ఉన్న సెంట్ ఫ్యాక్టరీని తనిఖీ చేయడానికి బుధవారం కర్ణాటక పోలీసులు రాగా వారి వాహనాలకు హెచ్‌డిహళ్లి గ్రామస్థులు అడ్డుకున్నారు. తనిఖీల పేరిట చిత్రదుర్గం జిల్లా హోళలుగెరే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చిక్కన్న, సిబ్బంది బుధవారం గంధపు చక్కలు అందించే చమన్‌బాషను వెంటబెట్టుకుని రావడంతో గ్రామస్థులు వారిని ఆపారు. తనిఖీల పేరిట ఫ్యాక్టరీలో పనిచేస్తున్న వర్కర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థులు పోలీసులను చుట్టుముట్టారు. కర్నాటక ప్రాంతంలో తోటలో పెంచిన గంధపు చెట్లను దొంగలించుకుని వెళ్లారని ఫిర్యాదులు రావడంతో దర్యాప్తు నిమిత్తం వచ్చామని సీఐ వివరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వకుండా రావడం సరికాదని ఎఎస్ఐ శ్రీరాములు అన్నారు. మడకశిర సీఐ రాజకుమార్, స్థానిక ఎస్ఐ వీరేషతోను ఈ కేసుకు సంబంధించిన విషయాలను కర్నాటక పోలీసులు చర్చించారు.

శనైశ్చరుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే



శనైశ్చరుడి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన పావగడ శనైశ్చరస్వామి ఆలయాన్ని తుంకూర్ జిల్లా పాల ఉత్పాదకుల సంఘం అధ్యక్షుడు, పావగడ ఎమ్మెల్యే హెచ్‌డి వెంకటేశ్ బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తుమకూరు జిల్లా పాల ఉత్పాదకుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఎమ్మెల్యే, మాజీ మంత్రి వెంకటరమణప్ప, మునిసిపల్ అధ్యక్షులు రాజేష్ తదితరులు కలిసి సీతాలాంబా సమేత శనైశ్చరస్వామిని దర్శించుకుని నవగ్రహ పూజలు నిర్వహించారు. మాఘమాసం సందర్భంగా ఆలయంలో జరిగే విశేష పూజ కార్యక్రమాల్లో కూడా ఆయన పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత: సీడీపీఓ

మడకశిర రూరల్ ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని సీడీపీఓ నాగమల్లేశ్వరీ పేర్కొన్నారు. మండలంలోని గుండుమల పాలిటెక్నిక్ కళాశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాలలు మన జాతీయ సంపద అని, వారిని కాపాడవలసిన బాధ్యత అందరిది అన్నారు. విద్యార్థులు కూడా బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదుగాలన్నారు.